# దళితులు - విద్యా హక్కు

...✍ శిరివెళ్ళ ప్రసాద్

**అక్షరం ఆయుధం - డా॥ బి.ఆర్. అంబేద్కర్**

అసమమైన ప్రభుత్వ విధానాల ఫలితంగా దేశంలో దళితులు అక్షరాలు నేర్చుకోవడానికి దూరమౌతున్నారు. మనువాదపు క్రూర విధానాల ఫలితంగా తరాలుగా దళితులు విద్యకి దూరమైన స్థితి మనకు తెలుసు. నేడు ప్రభుత్వాలు ఉన్నత చదువులను ప్రైవేటుపరం చేస్తున్న ఫలితంగా దళితులు ఫీజులు చెల్లించలేక పోతున్నారు. "అందరికీ విద్య" అనే నినాదాలతో ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వాలు కనీస వసతులు వనరులు కల్పించడం లేదు. ఇలాంటి విపత్కర పరిస్థితులలో ప్రజలు అక్షరాలు నేర్చుకోలేకపోతున్నారు. అర్హులైన దళిత విద్యార్థులు లేక ఇంజనీరింగ్ బి.ఇడి. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. దళితుల్లో అక్షరాస్యతా శాతం కూడా చాలా అధమంగా ఉంటుంది. పాలకులు విద్యకు తగినంత ప్రాధాన్యతనివ్వని కారణంగా వయోజన విద్యలో 28 రాష్ట్రాల్లో 22వ స్థానానికి ఆంధ్రప్రదేశ్ దిగజారిపోయింది. ఇక ఎస్సీ, ఎస్టీల అక్షరాస్యత శాతం గురించి అసలే చెప్పలేము. ప్రాథమిక విద్య, ఉన్నత విద్య దళితులకు అందుబాటులో లేని కారణంగా స్వాతంత్ర్యం వచ్చి 58 సం॥రాలు గడుస్తున్నా విద్య దళితుల దరికి చేరడం లేదు.

ఆర్టికల్ 26 యూనివర్సల్ డిక్లరేషన్ ఆన్‌హ్యూమన్ రైట్స్ 1948 ప్రకారం విద్య మానవుని సగౌరవ జీవనహక్కుగా ప్రకటించింది. విద్యా హక్కు, విద్య, అందులోనూ దళితుల విద్య చాలా ఆటంకాలకు గురౌతుంది. ఉన్న ప్రభుత్వ కళాశాలలు మూతపడుతుండగా ప్రైవేటు కళాశాలల సంఖ్య మాత్రం పెరుగుతున్నాయి. 2001 నివేదికల ప్రకారం దేశంలో నిరక్షరాస్యులుగా ఎస్సీ, ఎస్టీ, బిసిలు ప్రధానంగా కనిపిస్తున్నారు. చదువు మానేసిన వారికి పాఠశాలలకు వెళ్ళని వారికి ప్రభుత్వం కల్పిస్తున్న అనేక ప్రోత్సాహకాలు అమలుకు మాత్రం నోచుకోవడం లేదు.

పేద విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం నడిపిస్తున్న సంక్షేమ హాస్టళ్ళు ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అవినీతితో సంక్షోభ నిలయాలుగా మారుతున్నాయి. హాస్టళ్ళలో చాలీచాలని ఇరుకు గదులు చదువుకోవడానికి వీల్లేకుండా రాత్రులు - మిణుకు మిణుకుమని వెలిగే బల్బులు ఉంటాయి. దళిత, ఆదివాసీ, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్య, వసతులు అందించాలనే లక్ష్యంతో పనిచేయాల్సిన హాస్టళ్ళు అందుకు భిన్నంగా తిరోగమన దశలో పనిచేస్తున్నాయి. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ళలో మెరుగైన సౌకర్యాలు అమలయ్యేలా ప్రభుత్వ నిధులు సద్వినియోగం అయ్యేలా తనిఖీలు నిర్వహించే అధికారం కలిగిన స్టాండింగ్ కమిటీల సిఫారసులు సైతం బుట్టదాఖలు అవుతున్న పరిస్థితి నేడు కనిపిస్తుంది. మాసిన దుస్తులు, తైల సంస్కారం లేని జుట్టు, నిత్యం ఏదో ఒక వ్యాధితో సతమతమయ్యే స్థితి హాస్టళ్ళలో ఉండే విద్యార్థుల్లో నెలకొని ఉంది.

విద్య పట్ల నేడు కనిపిస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అందులోను దళితుల విద్యా ప్రమాణాల పట్ల ఆసక్తి లేకపోవడం అనేవి పాలకుల మనువాద విధి విధానాల మూలంగానే అని అర్థమవుతుంది. విద్య దేశంలోని ప్రతి పౌరునికి ప్రాథమిక హక్కు అనే విషయాన్ని ప్రభుత్వాలు ఎందుకు బహిరంగపరచడం లేదు అని మనం ఆలోచించాలి. ప్రధానంగా దేశంలోని దళితులు విద్య తమ ప్రధాన జీవన హక్కుగా భావించి ఆ హక్కుని పరిరక్షించుకునేందుకు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఐక్యరాజ్యసమితి కులవివక్షపై స్పందించి సంధానకర్తగా వ్యవహరించడానికి ముందుకు రావడంతో దీని అవసరాన్ని గుర్తించినట్లయింది. ఇదే విధంగా విద్యాహక్కుపై కూడా ఐక్యరాజ్యసమితి స్పందించాల్సిన అవసరం ఉంది. దళితులు విద్యాహక్కుని గుర్తించి తాము తమ పిల్లలు, ముందు తరాలు విద్యా సుగంధాలతో వెల్లి విరిసిన నాడే అంబేద్కర్ ఆశించిన నవసమాజం ఏర్పడుతుంది. కనుక దళితులు విద్యాహక్కుని స్వంతం చేసుకోవాలి. తరాలుగా యుగాలుగా అక్షరాల కోసం కన్న కలల్ని సాఫల్యం చేసుకోవాలి.

## దళిత్ కాల్ లైన్

**నెంబర్ : 040 55440969**

నేటి సమాజంలో కులవ్యవస్థ వేళ్ళు పాతుకొని పోయిన సందర్భంలో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ప్రజలు అనేక హింసలకు గురౌతున్నారు. కుల అకృత్యాలకు సాక్షులుగా ప్రత్యేకించి దళితులు, గిరిజనులు అందులోనూ స్త్రీలు మిగులుతున్నారు. అలాంటి ఘోరమైన పరిస్థితి హైటెక్ నగరమైన హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నుండి ఒంగోలు వెంగముక్కల పాలెం వరకు అనేక ఘటనలు మనముందుకు వస్తున్నాయి. రాష్ట్రమంతటా ఇలాంటి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సాక్షి మానవహక్కుల నిఘా తన బాధ్యతల్ని తాను నిర్వర్తించు కుంటూ ముందుకు వెళుతుంది. ఆ క్రమంలో ఉన్న సమాచార వ్యవస్థని మరింత విస్తృతం చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి సాక్షి దళిత కాల్‌లైన్‌ని ప్రారంభించింది. దళిత కాల్ లైన్ **నెంబర్ 040-55440969** ని అందరి ముందుకు తీసుకొస్తున్నాం.

గ్రామాల్లో వివిధ ఉద్యమాల్లో ప్రజోపయోగ కార్యక్రమాల్లో పాల్గొంటున్న సామాజిక కార్యకర్తలు ఆయా గ్రామాల్లో జరిగిన **"రేప్, మర్డర్, సాంఘిక బహిష్కరణ, సామూహిక దాడులు, ఆస్తుల విధ్వంసం, లాకప్‌మరణాలు** మొదలైన వాటి వివరాలు పైన తెలిపిన నంబర్‌కి సత్వరమే తెలియజేయ వలసిందిగా కోరడమైనది.

ఇట్లు

**సాక్షి మానవహక్కుల నిఘా**

# కులవివక్షపై స్పందించిన ఐక్యరాజ్యసమితి

...✍ మల్లేపల్లి లక్ష్మయ్య

కోట్లాది మంది దళితుల సమస్యను పరిశీలించి, పరిష్కారాన్ని సూచించే అధికారం, బాధ్యత ఐక్యరాజ్యసమితికి ఉందని, 1947 జనవరి 17వ తేదీన డాక్టర్ అంబేద్కర్ ప్రకటించారు. దళిత సంఘాలు, అంబేద్కర్ సంస్థలు 1990 ప్రాంతం నుంచి దళితుల సమస్యను ప్రపంచ దేశాల దృష్టికి తీసుకెళ్ళాయి. ఇదే క్రమంలో 2001 ఆగస్టు - సెప్టెంబరు నెలల్లో దక్షిణాఫ్రికాలోని దర్బన్‌లో జరిగిన ప్రపంచజాతి, వర్ణవివక్ష వ్యతిరేక సదస్సు ఒక మూలమలుపు లాంటిది. పన్నెండేళ్ళ తర్వాత జరిగిన ఈ సదస్సుపై దళిత ప్రతినిధుల కృషి ఎంతో ప్రభావాన్ని పడవేసింది. అప్పటివరకూ భారత దేశానికి పరిమితమైన దళితుల సమస్య ప్రపంచ అధినేతల దృష్టికి వివిధ ప్రభుత్వాల ప్రతినిధులకు, మానవహక్కుల సంఘాలకు వివరంగా తెలిపింది. రెండువందల మంది ప్రతినిధులు 15 రోజులపాటు నిరాటంకంగా చేసిన ప్రచారం, చర్చలు, పంచిన సాహిత్యం ఈ సమస్యకు ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించాయి. ఐక్యరాజ్యసమితి అధికారిక సదస్సులో ప్రపంచంలోని ముఖ్యంగా దక్షిణాసియా దళితుల పక్షాన జాతీయ దళిత మానవ హక్కుల ప్రచారోద్యమ (ఎన్‌సిడిహెచ్ఆర్) నాయకులు పాల్‌దివాకర్‌కు ప్రసంగించే అవకాశం వచ్చింది. దళితుల లాగా వివక్ష ఎదుర్కొంటున్న బాధితులు, అల్జీరియా, బంగ్లాదేశ్, బుర్కినా ఫాసో, ఇథియోపియా, గినియా, జపాన్, కెన్యా, లిబియా, మాలి మారిటోనియా, నేపాల్, నిగర్, నైజీరియా, పాకిస్తాన్, రువాండా, సెనెగల్, సోమాలియా, శ్రీలంక, యెమెన్ దేశాల్లో కూడా ఉన్నట్లు ఈ సదస్సులో వెల్లడయింది. వీళ్ళ మధ్య స్నేహం, ఒక అవగాహన ఏర్పడింది. దర్బన్ సదస్సులో దళితులు ఎదుర్కొంటున్న కుల వివక్షను చర్చించకుండా అప్పటి భారత ప్రభుత్వం అడ్డుకున్నది.

అంతర్జాతీయంగా వచ్చిన మద్దతు వల్ల ఎన్‌సిడిహెచ్ఆర్ ఈ సమస్యను నిరంతరంగా ఐరాస వేదికల మీద చర్చకు రావడానికి ఎడతెగని ప్రయత్నం చేసింది.

2002 ఆగస్టులో సమావేశమైన జాతివివక్ష నిర్మూలన కమిటీ (సిఇఆర్‌డి) కులవివక్షపై ప్రత్యేక చర్చను నిర్వహించింది. దీనిపై అప్పటికే నియమించిన గుణశేఖర్, ఏకసభ్య కమీషన్ నివేదికను అందుకున్నది. అయితే భారత ప్రభుత్వం గుణశేఖర్ కమీషన్‌ను అంగీకరించకపోగా, ఆయనను తొలగించాలని ఒత్తిడి చేసి సఫలమైంది. అయితే సిఇఆర్‌డి మాత్రం ఈ సమస్య అధ్యయనానికి కట్టుబడి ఉంది. అందుకుగాను నిపుణులైన అస్టోబర్స్ అయిబ్, యోకోబోలను ఈ అధ్యయనానికి నియమించింది. 2003 ఆగస్టులో ఈ కమిటీ నివేదికను అందించింది. దీనిపై 2004లో చర్చ జరిపిన కమిటీ ఐరాసలో మానవహక్కుల అత్యున్నత సంఘానికి నివేదించాలని తీర్మానించింది. 2004 సం॥రము నవంబర్ 30, 31 డిసెంబర్ 1వ తేదీల్లో యన్‌సిడిహెచ్ఆర్ మరియు ఐడియస్‌యన్‌ల మరియు అంతర్జాతీయ సంస్థల 100 మంది ప్రతినిధులు ఐక్యరాజ్యసమితికి తమ విజ్ఞాపనలు ఇచ్చి ఖాట్మండ్ డిక్లరేషన్‌లో తీర్మానాలు చేయించారు. మరియు మార్చిలో జరిగే కమీషన్‌లో ఈ తీర్మానాలు ఖచ్చితంగా అమలయ్యేటట్లు చూడాలని నిర్ణయించారు. ఏప్రిల్ 19, 2005లో సమావేశమైన ఐరాస మానవహక్కుల కమీషన్ ఈ సమస్య తీవ్రతను అంగీకరించింది. మూడు సంవత్సరాలు ఈ సమస్యను అధ్యయనం చేసి ప్రతి సంవత్సరం ఒక నివేదికను అందించడానికి జపాన్‌కు చెందిన యెజోయొకోలు, దక్షిణ కొరియాకు చెందిన చిన్‌సంగ్ చుంగ్‌లను నియమించడం 1947 నుంచి ఇప్పటివరకు జరిగిన క్రమానికి స్పష్టమైన విజయంగా చెప్పవచ్చు. అయితే, ఈ నిర్ణయం వల్ల ఎటువంటి పరిణామాలు జరుగుతాయనేదిక్కడ చర్చనీయాంశం కాదు. ఈ కమిటీ సభ్యులు ప్రతి సంవత్సరం అన్నిదేశాల్లో పర్యటించి ఆయా తెగల, కులాల ప్రజల స్థితిగతులను, ఇప్పటికే అమలులో ఉన్న చట్టపరమైన రక్షణలను, వాటి అమలును, ఒకవేళ రక్షణ ఏర్పాట్లు లేనట్లయితే ఎటువంటివి రూపొందించవచ్చనే విషయాలను పరిశీలిస్తుంది. సూచనలు సలహాలు అందిస్తుంది. దీనివలన ఆయా ప్రభుత్వాల మీద ఐరాస విభాగాలైన యునెస్కో, ఐఎల్ఓ, యునిసెఫ్, యుఎన్‌డిపి సంస్థలు అమలు చేస్తున్న కార్యక్రమాల్లో దళితులతో పాటు ఇతరదేశాల్లో వివక్షను ఎదుర్కొంటున్న వర్గాలకు సరియైన ప్రాతినిధ్యం ఉండేటట్లు, ప్రయోజనం చేకూరేటట్లు ఈ కమిటి నివేదికలు ఉపయోగపడతాయి. దీనికి మహిళల పట్ల ఆయా దేశాల ప్రభుత్వాలు చూపుతున్న ప్రత్యే శ్రద్ధను ఒకసారి పరిశీలిస్తే ఈ కమిటీ అవసరం మనకు అర్థం కాగలదు. 1970 దశకానికి ముందు మహిళల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రత్యేకమైన శ్రద్ధ లేదు. 1970 దశకంలో బీజింగ్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సదస్సు అనంతరం ఐరాస ఈ విషయంపై దృష్టి నిలిపింది. అట్లాగే బాలల హక్కులకు సంబంధించిన ఐరాస ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాతనే ఎన్నో కార్యక్రమాలు రూపుదిద్దుకున్నాయి. మనదేశంలో అమలు జరుగుతున్న బాలల కార్యక్రమాలు, బాలకార్మిక నిర్మూలన చట్టాలు ఇవన్నీ కూడా ఐక్యరాజ్యసమితి పుణ్యమే. భారత ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లోనైనా ఐరాస విధానాలను, సలహాలను పాటించక తప్పదు. అయితే ఇక్కడి దళిత సంఘాలు, ఉద్యమాలు ఈ అవకాశాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి. ●

# అక్షర జ్ఞానానికి దూరమౌతున్న దళితులు

...✍ ప్రొ॥ హరగోపాల్

సమకాలీన సమాజంలో విద్య మరియు ప్రజాస్వామ్య సంబంధాల మధ్య వైరుధ్యం, సాన్నిహిత్యం ఉంది. విద్యలో ప్రజాస్వామ్యం కానీ, ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్య కానీ సంపూర్ణంగా భారతదేశ చరిత్రలో లేదు. సాధించే ప్రయత్నంలో ఉన్నాము. ప్రపంచంలో కొందరు చదువుకోకూడదని, అక్షర జ్ఞానం కూడా వద్దని రాసిన దేశాల్లో భారతదేశం ఒకటి.

నిజానికి ఈ రోజు మనం క్రిస్టియన్ మిషనరీలను, వారిపై జరిగే దౌర్జన్యాలకు కొంచెం వెనుకకు వెళ్ళి చూస్తే కళ్యాణరావు గారు "అంటరాని వసంతంలో ఓ దళితుని వాడు మనిషేకాడని గ్రామం నుంచి బహిష్కరిస్తే, అలాంటి మనిషి చేయి పట్టుకుని "నీవు మనిషివే" అని అన్నదే క్రిస్టియానిటీ అని అంటారు. ఆ రోజుల్లోనే అంతమంచి పనిచేసిన క్రిస్టియన్లను నేడు చంపుతున్నారు, దాడులు చేస్తున్నారు. క్రిస్టియన్లపై ఎందుకు అంతకోపం? మనుషులుగా చూడబడని వారిని క్రిస్టియన్లు మనుషులన్నారు. 'కిరస్తానీ' అయితే ఫరవాలేదు. కాని దళితుడు మాత్రం ఇంట్లో రాకూడదనే వారి గురించి క్రిస్టియన్లపై దాడులు చేసేవారిని సమాధానం చెప్పమనాలి.

భారతదేశంలో క్రిస్టియన్ మిషనరీలు వచ్చిన తర్వాతనే పేదవారికి విద్య, అట్టడుగు వర్గాల వారికి అక్షరజ్ఞానం అందడం మొదలైంది. మద్రాసులో ముస్లింలు ఈ ప్రయత్నం చేసినా పైచేయి మాత్రం క్రిస్టియన్లదే. స్వాతంత్రోద్యమ కాలంలో విద్యావ్యవస్థ మౌళికంగా మారాల్సిన అవసరం ఉండెను. మొత్తంగా స్వాతంత్రోద్యమంలో వలసవాదానికి వ్యతిరేకంగా ఉద్యమం జరిగింది. కాని భారతదేశంలో ఉండే సామాజిక వ్యవస్థ భిన్న రంగాలలో మౌళికమైన ప్రజాస్వామ్య మార్పు రావాలనే సంపూర్ణ ఆకాంక్ష భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మనకు కన్పించదు. అంబేద్కర్ జరిపిన ఉద్యమాల్లో ఈ ప్రజాస్వామ్య ఆకాంక్ష కొంత కన్పించినా, మొత్తం సమాజాన్ని ప్రభావితం చేసే సంపూర్ణ స్వాతంత్రోద్యమం ఆ కాలంలో రాలేదు. కావున దాన్ని చరిత్ర అసంపూర్ణంగా మిగిల్చిన స్వాత్రంత్రోద్యమం గానే చూడాలి. కాని స్వాతంత్రోద్యమం ఈ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం తీసుకొచ్చిందని ఎవరైనా అనుకుంటే "ప్రజాస్వామ్యం - విద్య" గురించి మాట్లాడడం కష్టం.

బ్రిటీష్ వలసవాద విద్యావిధానాన్ని స్వాతంత్రోద్యమ కాలంలో వ్యతిరేకించిన మాట వాస్తవమే. గాంధీ ఈ విద్యా విధానాన్ని వ్యతిరేకించాడు. మరి అప్పుడు వచ్చిన ప్రత్యామ్నాయ ప్రయోగాలు ఏమిటి? కుటుంబరావు గారి 'చదువు'లో ఈ పాశ్చాత్య విద్య పనికిరాదని బ్రాహ్మణులు వేద విద్య నేర్చుకున్నారు. పిలకలు పెంచుకొని ఆశ్రమాల్లో విద్య నేర్చుకున్నారు. నేటికీ కొందరు సంస్కృతం నేర్చుకుంటున్నారు. గాంధీ "బేసిక్ విద్య"ను ప్రతిపాదించారు. దీనిలో "కొంత వృత్తి విద్యకు సంబంధించిన విద్య ఉంది" అన్నదానికి - కృష్ణకుమార్ విమర్శిస్తూ "బేసిక్ విద్య కులవ్యవస్థ నిర్మాణంలో వృత్తివిద్య ఉండి ఉందని మేధోవిద్య, ఫిజికల్ ఎడ్యుకేషన్ అనే ద్వంద్వ విధానం భారతదేశంలో చాలాకాలం నుండి అమల్లో ఉందని, వడ్రంగి, కంసాలి, కమ్మరి వంటి శ్రమించేవారంతా విద్య ద్వారా వచ్చినవారే. ఉత్పత్తిలో పాల్గొనే విద్య వారికుంది. బ్రాహ్మణ సంబంధ విద్యలో తాత్వికత, స్పీనలేటివ్, కార్యాచరణ, నైతిక సంబంధమైనవి ఉండేవి. కాని స్కిల్స్‌కు సంబంధించిన విద్య మాత్రం వేరొక విద్య. బేసిక్ విద్యలో అబ్‌స్ట్రేషన్ మరియు కాంక్రీట్, వాస్తవంగా కావలసిన పరికరాలు, మనిషి మౌళికంగా లోచించడానికి, ప్రపంచాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఆలోచించే విద్య ఒకటి. అర్థం చేసుకొన్న దానితోపాటు ఉత్పత్తిని పెంచడానికి కావలసిన నైపుణ్యం, మేధస్సు పెరగడానికి కావలసిన నైపుణ్యం మరోటి. అంటే మానవ సంబంధాలను అర్థం చేసుకునే, నైతికంగా మానవులు ఎలా బ్రతకాలి అనే దానితోపాటు ఒక నైపుణ్యం సంపాదించుకోవడం అనేవి విద్య యొక్క సమగ్ర స్వరూపం. గాంధీ బేసిక్ విద్యలో ప్రపంచాన్ని అర్థం చేసుకోగలిగే తాత్విక భావనను చెప్పలేదని, ఇది కులవ్యవస్థ కొనసాగింపు గానే ఉందని కృష్ణకుమార్ విమర్శించాడు. తన పని తాను చేసుకోవాలి, కొన్ని నైపుణ్యాలు నేర్చుకోవాలి, ఉత్పత్తిలో నేరుగా పాల్గొనాలి. శ్రమను గౌరవించాలి అనే వాటిని గాంధీ తన బేసిక్ విద్యలో ప్రతిపాదించాడు.

ఉన్నత వర్గాలకు ఆశ్రమవిద్యకు సంబంధించిన ప్రయోగం ఠాగూరు శాంతినికేతన్ ద్వారా చేశాడు. దీనిలో కొంత ఇన్నోవేషన్ ఉంది. కాని ఈ విద్య ద్వారా సమాజానికి ఉత్పత్తి పెరగడం, మానవ సంబంధాలు మారడం జరుగుతున్నాయా? అనే దానిపై నేడు కూడా చర్చ జరుగుతోంది. గుజరాత్‌లో గిజూబాయి చేసిన ఒక్క ప్రయోగంలో మాత్రమే పిల్లవాణ్ణి మనిషిగా చూడాలని, అతన్ని సంపూర్ణంగా మార్చాలని, అతనికి సెన్సిటివిటి, ఆలోచించే శక్తి ఉంటుందని చెప్పడంలోనే కొంత ప్రజాస్వామిక భావన ఉంది. ఇది తప్ప మొత్తం స్వాతంత్రోద్యమ కాలంలో వచ్చిన అన్ని ప్రయోగాలలో ప్రజాస్వామ్య ఆకాంక్ష విద్యా విధానంలో కన్పించలేదు.

1944లో కాంగ్రెసు వర్కింగ్ కమిటీలో ప్రజాస్వామ్య విద్యపై చర్చ జరుగలేదు. కాని స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సంపూర్ణ అక్షరాస్యత ఎంతకాలంలో సాధిస్తాం అనే చర్చ వచ్చింది (అప్పుడే బాంబే ప్లాన్ కూడా వచ్చింది) ఆ సందర్భంలో ఓ సభ్యుడు 40ఏళ్ళ తర్వాత సంపూర్ణ అక్షరాస్యత సాధించు కుందామని అంటే, స్వతంత్ర భారత ప్రజలు ఈ సుదీర్ఘ కాలాన్ని సహించరని చాలామంది సభ్యులు వ్యతిరేకించారు. అంటే వారి దృష్టిలో భారత ప్రజలు భవిష్యత్తులో చైతన్యవంతులౌతారు, ఎదిరిస్తారు అని అనుకొని 10సం॥రాలలో 'అందరికీ విద్య' అని తీర్మానించారు. అంటే 1960 వరకు సంపూర్ణ అక్షరాస్యత

సాధిస్తామని రాజ్యాంగంలో రాశారు. 1944లోని కాంగ్రెస్ పార్టీ ఆలోచనకు, ఇప్పటి కాంగ్రెస్ పార్టీ ఆలోచనకు స్పష్టమైన తేడా మనకు కన్పిస్తుంది. 1948లో రాధాకృష్ణ కమీషన్ దేశం స్వావలంబన దిశగా ఉత్పత్తి పెరగడానికి కావలసిన నైపుణ్యం, సార్వభౌమ, స్వతంత్రదేశంగా రూపొందడానికి కావలసిన విద్యా విధానాన్ని రూపొందించుకోవాలని సిఫార్సు చేసింది. కాని ఆ దిశలో మనం పోలేదు. 1964 వరకు అలాగే నెట్టుకురావడంతో, దేశంలోని అట్టడుగు వర్గాల ప్రజల ఆకాంక్షకు స్పందన లేకపోవడంతో భిన్నరూపాల్లో అసంతృప్తి వ్యక్తమయింది. "మా జీవితం ఏమిటి?" అన్న ప్రశ్న మొదటిసారిగా ఉత్పన్నమైంది. ప్రాంతీయ ఉద్యమాలు, ఉపప్రాంతీయ ఉద్యమాలు, ఒరిస్సాలో ఫుడ్‌రైట్స్ ఉద్యమం, బెంగాల్‌లో నక్సల్బరీ ఉద్యమరూపంలో సమాజం స్పందించింది. అప్పుడు కొఠారీవిద్యా కమీషన్‌ను నియమించారు. స్వాతంత్ర్యానంతరం వచ్చిన అన్ని విద్యాకమీషన్ రిపోర్టులలో చాలా హేతుబద్ధమైన ప్రజాస్వామ్యయుతమైన డాక్యుమెంట్‌ని కొఠారి కమీషన్ రిపోర్టుని చెప్పవచ్చు. ఈ రిపోర్టులో నైబర్‌హుడ్ స్కూల్స్ పెట్టాలనే ప్రతిపాదన మౌళికమయిన మరియు విప్లవాత్మకమైన ప్రతిపాదన. ఎందుకంటే ఉదారవాద ప్రజాస్వామ్య దేశాలైన యూరోపియన్ దేశాలలోగాని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి ఆదర్శవంతమైన అమెరికా దేశంలో కూడా ఉన్నతపాఠశాల స్థాయి వరకు విద్యారంగం ప్రయివేటు రంగంలో లేదు. పూర్తిగా పబ్లిక్‌రంగంలోనే ఉన్నది.

మనదేశంలో పూర్వకాలంలో బ్రాహ్మణులు నడిపిన ఆశ్రమ పాఠశాలలు, ముస్లిములు మదరసాలు, క్రైస్తవ మిషనరీల పాఠశాలలు కూడా ప్రయివేటువి అనడానికి వీలులేదు. లాభాపేక్షతో వారు నడపలేదు. 1950 తర్వాత వచ్చిన పాఠశాలలన్నీ ఇంచుమించు వ్యాపారమయమైనవే. కొఠారి కమీషన్ ప్రతిపాదించిన నైబర్‌హుడ్ స్కూల్స్ ప్రతిపాదనను అప్పుడు మనం అమలుచేసివుంటే, విద్యను ఉన్నతపాఠశాల వరకైనా పబ్లిక్ సెక్టార్‌లో పెట్టి ఉంటే సమాజంపైనే దాని బాధ్యతను పెట్టి, లేదా ప్రభుత్వమే బాధ్యత వహించి పాఠశాలలు నిర్వహించినట్లయితే ప్రజలందరికీ సమాన అవకాశాలు ఇచ్చినట్లుండేవి. సమాన అవకాశాలపై అంబేడ్కర్ మాట్లాడుతూ సమానత్వమంటే గణితం రీత్యా సమానత్వం కాదు, సమానత అంటే అందరూ సమానంగా ఉంటారని కాదు. సమానత అంటే సమాన అవకాశాలు ఉండాలని అన్నాడు.

స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్ళలోనే సమానావకాశాలు ఇవ్వకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది ఎలా ఉంటుంది? క్వాలిటీ విద్యను నేర్చుకోవడానికి అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తే ఎవరి ఆకాంక్షలను బట్టివారు చదివిపైకి వెళ్తారు. కాని విద్యారంగాన్ని రకరకాల పేర్లతో, అనేక రకాల విద్యాలయాలు నడిపితే ఈ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు కావలసిన పునాదిగా, ప్రజాస్వామ్య సంస్కృతి గాని పెరిగే సామాజిక వాతావరణం కల్పించామనడానికిగాని, ప్రజాస్వామ్యం బలపడుతుందనడానికి గాని ఏ విధమైన అవకాశం లేదు. ఒక్కొక్కరికి ఒక్కోరకమయిన విద్యనిస్తుంటే కొఠారి కమీషన్ తర్వాత నైబర్‌హుడ్ స్కూల్స్‌ను గూర్చిన ప్రతిపాదన మళ్ళీ చర్చకు రాలేదు. కాని దీనికి విరుద్ధంగా 1985లో రాజీవ్‌గాంధీ నూతన విద్యా విధానం వచ్చింది. దీన్నందరూ వ్యతిరేకించారు. ఈ విద్యా విధానం ప్రకారం దేశ వ్యాప్తంగా ఒక్కొక్కటి కోటి రూ॥ వ్యయంతో సుమారు 500 నవోదయ విద్యాలయాలు స్థాపించారు. ఈ విద్యాలయాలు గ్రామీణ ప్రాంతాలలో హరిత ప్రాంతాలలో హరిత విప్లవం తర్వాత కొంత బాగుపడిన కుటుంబాల పిల్లలకు ఉపయోగపడు తున్నాయి. 1964-66లోని కొఠారి కమీషన్‌కు ప్రజాస్వామ్య భావన ఉంటే 1985లోని నూతన విద్యా విధానం విద్య హక్కే కాదన్నది.

ప్రస్తుతం విద్య ఎలా కొనసాగుతుందో మనకే తెలియదు. అంతా ప్రపంచబ్యాంక్ గుప్పిట్లో ఉంది. మన ప్రభుత్వాల నియంత్రణ లేనేలేదు. ప్రాథమిక విద్యపై మాత్రమే ప్రభుత్వం ఖర్చుపెట్టాలి కాని ఉన్నతవిద్య నాన్-మెరిట్‌గుడ్ అయిపోయింది. సమాజానికి పనికివచ్చేదంతా. మెరిట్ గుడ్ ఉన్నత విద్య వారికే ఉపయోగపడుతుంది. కనుక ఆది నాన్ మెరిట్ గూడ్ అంటున్నారు. సమాజం మొత్తానికి పనికివస్తుంది. కనుక పోలీస్‌మెరిట్ గూడ్ అట ఇది సరియైనదేనా? విద్యా వ్యవస్థలో ఉన్నత విద్య చదివిన తరువాత సామాజిక ప్రయోజనం ఉండాలి 'మీకు మీరుగా బ్రతకండి' అనే పునాదిపై విద్యా వ్యవస్థను రూపొందిస్తే బాగుంటుందా? అది సమాజాన్ని ప్రజాస్వామీకరిస్తుందా? ప్రపంచబ్యాంకు విద్య యొక్క నిర్వచనాన్నే మార్చివేసింది. ప్రభుత్వ సలహాదారులు ప్రపంచబ్యాంక్ కంటే కొంత ముందే ఉండి, ఫీజులపై, కాలేజీలపై ప్రభుత్వ నియంత్రణ ఉండవద్దనీ ఎవరు ఎన్ని కాలేజీలైనా పెట్టుకోవచ్చునని అంటున్నారు. ఇన్ని కాలేజీలు పెడితే ఎలా? ఇది అరాచక వాదం కాదా? మరి డబ్బు లేని వారి గతి ఏమిటి? 2007 సంవత్సరమునకు రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు గ్రాంట్ లేకుండా చేయడానికి ఏటా 15% తగ్గిస్తున్నారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేదు. ఏ యూనివర్శిటీ వారు వారే ఏర్పాటు చేసుకోవా లంటున్నారు. ఇలా అయితే దళిత విద్యార్థుల పరిస్థితి ఏమిటి? గత 50సం॥రాలుగా అన్ని కులాల నుంచి ముఖ్యంగా మహిళలు భిన్నమైన పాలనారంగాలలో ఉండడంతో (చేరడంతో) సమాజంలో దానివల్ల వచ్చే ప్రభావం భిన్నంగా ఉంటుంది. అమ్మాయిలకు కల్పించిన రిజర్వేషన్ వలన ఉన్నతాధికారులుగా అట్టడుగు వర్గాల స్త్రీలు పాలనారంగంలో చేరే చారిత్రక దశలో మొత్తంగా విద్యలో మార్పులు వచ్చాయి. ఉన్నత విద్య ప్రయివేటుపరం కావడం, డబ్బున్నవారే చదువుకునే అప్రజాస్వామిక విధానం వచ్చింది. ప్రపంచబ్యాంక్ నిర్వాకమే ఇది. మార్కెటు అవసరాలను తీర్చటమే విద్యకు ఇచ్చే నిర్వచనంగా మారింది. ఉద్యోగం వస్తుంది కాబట్టి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదువుతున్నామనే స్థితికి నేటి విద్య మారింది. దిగుమతి చేసుకున్న విజ్ఞానంతో కాలం వెళ్ళదీస్తున్నాం. విజ్ఞానమున్న దగ్గర డబ్బులిచ్చి కొనుక్కొనే పరిస్థితి వచ్చింది.

విజ్ఞానమనేది మానవ సమాజం యొక్క వారసత్వం అనే నిర్వచనం మారి ఐనిస్టైన్ ఎవరికి చెందినవాడు అంటే మానవ సమాజానికి చెందినవాడనడం పోయి ఒక కంపెనీకి చెందిన వాడయ్యాడు. ఆయనకు పేటెంటు ఉంటుంది. దాన్ని మనం ఉపయోగించుకోవాలంటే రాయల్టీ చెల్లించాలి. ఇక్కడ దాకా వచ్చింది మన విద్యా వ్యవస్థ. ఈ తీరు మారాలి. పేద దళిత గూడేల్లో కూడా విద్యాకాంతులు వెల్లివిరియాలి. ఆ రోజు కోసం మనం ఎదురు చూడాలి.

*(విజృంభణ సౌజన్యంతో)*

# నేటి సమాజంలో దళితులకు చదువు - అందని ద్రాక్షయేనా!

...✍ - సారంపల్లి

"రానున్న పది సంవత్సరాలలో అందరికి చదువు" అంటూ స్వాతంత్ర్యానంతరం పాలకులు ప్రకటించారు. 1947 ఆగస్టు 15వెళ్ళి 58 సంవత్సరాలు గడుస్తున్నా ఈ రంగంలో మాత్రం ఆశించిన అభివృద్ధి కానరావడం లేదు. దేశంలో చదువుకున్న వారి శాతం 64.84 కాగా ఆంధ్రప్రదేశ్‌లో 60.47 శాతంగా (2001) ఉంది. ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే 42.6 శాతం (2003-04) చదువు మానివేస్తున్నారు. పై తరగతులకు వెళ్ళిన కొద్దీ చదువుమాని వేస్తున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది - వివిధ మేనేజ్‌మెంట్లు క్రింద 3283 జూనియర్ కళాశాలలున్నాయి. కనీసం జూనియర్ కాలేజీలు లేని మండలాలు అనేకం ఉన్నాయి. ఇతర మండలాలకు వెళ్ళి చదువుకోగల స్థోమత లేనివారు అర్ధాంతరంగానే చదువులు మానివేస్తున్నారు. ఇదీ రాష్ట్ర పరిస్థితి ఇక దళితులలో చదువును పరిశీలిస్తే మరింత ఆందోళన కల్గించే దృశ్యాలు గోచరిస్తాయి. చదువు వారికి గగనకుసుమంగా ఉంది "అందరూ చదవండి" అంటూ దినం ప్రచార, ప్రసారసాధనాలలో చేసే ప్రచారానికి పెట్టిన వ్యయం కూడా చదువుకోసం పెట్టడం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ దిగువ పట్టికను పరిశీలిద్దాం (దళితుల వివరాలు - లక్షల్లో)

| క్ర.సం | వివరం | 1961 | 1971 | 1981 | 1991 | 2001 |
|---|---|---|---|---|---|---|
| 1. | జనాభా | 49.73 | 57.74 | 79.61 | 105.92 | 123.40 |
| 2. | మగవారు | 25.12 | 29.27 | 40.39 | 53.80 | 62.28 |
| 3. | స్త్రీలు | 24.61 | 28.47 | 39.22 | 52.12 | 61.12 |
| 4. | చదువుకున్న మగవారు | 3.37 | 4.65 | 10.02 | 18.50 | - |
| 5. | శాతం% మగవారు | 13.43 | 15.90 | 24.80 | 34.49 | - |
| 6. | చదువుకున్న స్త్రీలు | 0.84 | 1.50 | 4.02 | 8.92 | - |
| 7. | శాతం % | 3.4 | 5.30 | 10.25 | 17.12 | - |
| 8. | మొత్తం శాతం | 8.47 | 10.65 | 17.65 | 31.58 | 40.00(అంచనా) |

పై గణాంకాలు తెలియజేస్తున్న దేమిటి? జనాభా రీత్యా దళితుల జనాభా 16.16 శాతం ఉంది- గణనీయ సంఖ్య గల్గిన వీరికి సమాజంలో తగు స్థానం లభించే విధంగా విద్యనందించడంలో ప్రభుత్వాలు ఉద్దేశ్యపూరిత నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నాయి.

దళిత జనాభాలో చదువుకు ప్రాథమిక పాఠశాలకు వెళ్ళినవారు 40శాతంగా యున్నారు. 123.40 లక్షల జనాభాలో 49.36 లక్షల మంది దళితులు ప్రాథమిక పాఠశాలకు వెళ్లినట్లు ప్రభుత్వ రికార్డులు తెలుపుతున్నాయి. వాస్తవానికి పాఠశాలలో నమోదు చేయించుకున్న మరుసటి దినం నుండే పాఠశాలకు వెళ్ళని వారుండగా, సర్వే పేరుతో ఉపాధ్యాయులే పల్లెల (గూడెం)కు వచ్చి పిల్లల పేర్లు నమోదు చేయించుకున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఈ విధంగా నమోదు చేయించుకున్న పేర్లలో ప్రాథమిక పాఠశాల స్థాయి దశలోనే 60శాతంపైగా చదువులు మానివేస్తున్నారు.

బాలికల పరిస్థితి మరీ దారుణం పట్టణప్రాంతాలలో దళితులలో కొంతమేరకు చదువుకున్నా, గ్రామీణ ప్రాంతాలలోని పల్లెలలో చదువుకు దూరంగా యున్న దళితులలోని వారి జనాభా 80శాతంగా యుంటుంది. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా దళితులకు విద్యారంగం కల్పిస్తున్నా ప్రభుత్వం బడ్జెటు పత్రాలలో పేర్కొంటున్నది. సాంఘిక సంక్షేమశాఖ బడ్జెటు డిమాండుతో రూ. 1016.17 కోట్లు శాసనసభ ఆమోదానికి పెట్టింది. ఇందులో ప్రణాళిక వ్యయంతోపాటు ప్రణాళికేతర వ్యయం కూడా చేరియున్నది - సాధారణంగా ఇచ్చే జీతభత్యాలు, ఇతర వ్యవహారిక నిర్వహణవ్యయాలు ప్రణాళికేతర వ్యయంగా ఉంటాయి. వెట్టిచాకిరి నిర్మూలన పథకం జోగిని మహిళలకు పునరావాసం, సాంఘిక భద్రతా కార్యక్రమాలు, (ఆనంద నిలయాలు - పెన్షన్లు) ఇండ్ల స్థలాలు, కమ్యూనిటీ హాళ్ళు, కులాంతర వివాహ ప్రోత్సాహకాలు, అత్యాచార బాధితులకు పరిహారాలు, నిర్వహణ సబ్సిడీలు కూడా చేరియున్నాయి. ఏతా-వాతా ఈ పద్దులన్నీ తీసివేస్తే దళితులకి విద్యారంగానికి కేటాయిస్తున్న బడ్జెటు నామమాత్రమే.

ప్రస్తుతం రాష్ట్రంలో (2004-05) 1625 బాలుర హాస్టళ్ళు, 585 బాలికల హాస్టళ్ళున్నాయి. ఇందులో 2.50 లక్షల మంది యుండగా వీరిలో దళితులు 1.75 లక్షలమంది మాత్రమే మిగిలిన వారు వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డు, తెగలు, ఇతరులు చేరియున్నారు. - ఈ హాస్టళ్ళలో చదివే వారికి 1999 లో 7వ తరగతి చదివేవారికి నెలకు రూ. 270లు, 10వ తరగతి చదివేవారికి రూ. 330లు గా నిర్ణయించారు. 6 సంవత్సరాలుగా హాస్టలు చార్జీలు పెంచలేదు. గత 6సంవత్సరాల కాలంగా ఆహార వస్తువులు, బట్టలు, పుస్తకాల రేట్లు రెట్టింపు పెరిగాయి. ప్రభుత్వానికి ఈ పెరుగుదల ఏమి పట్టినట్లు లేదు. హాస్టళ్ళలో ఉన్న బాలురకు అలంకరణకు నెలకు రూ. 20లు, బాలికలకు రూ. 25లకు నిర్ణయిస్తూ 1-6-99న అమలులోకి వచ్చే విధంగా 3-5-99న సాంఘిక సంక్షేమశాఖ 39వ జీవో లో చెప్పింది. ఈ అలంకరణకు ఇస్తున్న రూపాయలతో కనీసం 15రోజులకు సరిపడిన సబ్బులు కూడా రావు. నేడున్న దళిత హాస్టళ్ళను పరికిస్తే మురికి కూపాలుగా

ఉంటాయి. అయినప్పటికీ పదవ తరగతిలో హాస్టల్ బోర్డర్లు 85.04 శాతం ఉత్తీర్ణులౌతున్నారు. ప్రోత్సాహముంటే వీరు ఎలాపైకి వస్తారనేది వీరి ఉత్తీర్ణతా శాతం తెలియజేస్తున్నది.

కళాశాలలో చదువుకుంటున్న వారికి ప్రతి 100 మందికి ఒక్కో హాస్టల్ పెట్టారు. కాలేజీ హాస్టళ్ళకు 2005-06లో రూ. 4.64 కోట్లు కేటాయించారు. ఈ కేటాయింపుతో ఎంత మంది కాలేజీ విద్యనభ్యసిస్తారు. అపరిశుభ్ర వృత్తుల్లో చేసేవారి పిల్లలకు కేటాయింపు రూ. 3 కోట్లు మాత్రమే - షెడ్యూల్డు కులాలకు చెందిన న్యాయవాద వృత్తి చేసేవారికి 2005 - 06 సంవత్సరానికి రూ. 30లక్షలు కేటాయించారు. నెలకు రూ. 500ల స్టైఫండు, లా పుస్తకాలు, లా పుస్తకాలు, ఫర్నిచరు కొనుగోలుకు రూ. 3585 ఇస్తారు. ఇది ఏ మూలకు వస్తాయి.

డాక్టర్లు, వ్యవసాయ పట్టభద్రులకు, ఇంజనీర్లకు ఇతర కులాలకు చెందినవారికి లక్షల కొలది రుణాలు, సబ్సిడీలు మంజూరు చేస్తున్నారు. అన్ని వనరులున్న వారు తీసుకున్న రుణాలు కూడా చెల్లించడం లేదని బేంకులు గగ్గోలు పెడ్తున్నాయి. లేని దళితులకు ఆర్థిక సహాయం చేయడమంటే ప్రభుత్వానికి, బేంకులకు హామీలు, సెక్యూరిటీలు కావాలి.

చదువును మధ్యలో మానేసిన వారికి, పాఠశాలకు రాని వారికి ప్రోత్సాహక పథకాలు అనేకం ప్రకటిస్తున్నారు. ఏ ప్రభుత్వం అధికారానికి వచ్చినా ప్రకటనల హామీ సాగుతూనే ఉంటుంది. ఆచరణలో ప్రభుత్వం ప్రకటించిన పథకాలు ఏ మేరకు అమలువుతున్నాయి? ఇవి ఎంతవరకు ఫలితాలు సాధిస్తున్నాయి? మొదలైన పరిశీలన లేవి జరగటం లేదు.

**గతంలో ప్రకటించిన పథకాలు**

1. అక్షర సంక్రాంతి 2. బడికి పోదాం 3. నల్లబల్ల పథకం 4. మళ్ళీ బడికి 5. సమ్మర్ పాఠశాలలు 6. బ్రిడ్జి పాఠశాలలు 7. ఓపెన్ పాఠశాలలు 8. చదువుల పండుగ 9. మధ్యాహ్న భోజన పథకం 10. మమత (అనాధపిల్లలకు)

ఇలాంటి పథకాలు ఎన్ని ఉన్నా విద్యార్థుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. ఇప్పటి పాఠశాలకు వెళ్ళగల్గినవారు 3.64 లక్షల మంది యున్నట్లు (6-12-2003 నాటికి) సర్వేలు తెలుపుతున్నాయి. ఈ సర్వేలు ఎవరో చేసింది కాదు - ప్రభుత్వం నిర్వహించిన సర్వేలోనే ఈ సంఖ్య తేలింది - వాస్తవానికి ఈసంఖ్య ఇంకా పెరుగుతుంది. ఇందులో అధిక శాతం దళిత, గిరిజన, వెనుకబడినవారే 70శాతంపైగా ఉంటారు. ప్రభుత్వ పథకాలు అవినీతి అందరెగినదే. ప్రభుత్వ పథకాలు గ్రామదేవతలకు ఆదాయ పథకాలుగా ఉన్నాయి. అలాగే దళితులు వంటచేస్తే పిల్లలు తినకుండా అగ్రవర్ణ ఆధిపత్యం ఎన్ని ఆటంకాలు కల్పిస్తున్నదో తెలియంది కాదు - ఈ మధ్య సహపంక్తి భోజనానికి దేవాదాయ శాఖమంత్రిని ఆహ్వానిస్తే వచ్చిన తిరస్కార ధోరణిని పత్రికలలో చూచాము.

14 సంవత్సరాల వరకు ప్రభుత్వ నిర్బంధ విద్యా విధానం అమలుచేసి "అందరికి విద్య" ప్రణాళికను అమలుపర్చటానికి పాలకులు చిత్తశుద్ధితో లేరనేది ఆచరణ నేర్పుతున్న పాఠం. నేడు పల్లెలలోని దళితులు విద్యాగంధం లేక దేశ, రాష్ట్ర, ఆర్థిక నిర్మాణంలో పాల్గొనలేక పోతున్నారు. దీనికి తోడు ప్రాథమిక స్థాయి విద్య కూడా ప్రైవేటుపరమై ఆక్రమణకు గురైంది. ప్రైవేటు వ్యక్తుల నుండి కార్పోరేటు రంగంలోకి మారుతున్నది.

కార్పోరేటీకరణకు ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తున్నది. ఈ కార్పోరేటు పాఠశాలలకు దళిత పిల్లలు వెళ్ళి విద్యాభ్యాసం చేయగలరా? గ్రామీణ దారిద్ర్యం దినదినం పెరుగుతున్నది. రోజువారీ కూలికి వెళ్ళే దళితులకు పని దినాలు తగ్గిపోతున్నాయి. గ్రామాలలోకి భారీ యంత్రాల ప్రవేశంతో వ్యవసాయ పనులు కూడా దొరకని స్థితి ఏర్పడి గ్రామాలకు, గ్రామాలే వలసలు వెళ్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నియమించిన 'వెలుగు" సర్వే అనేక విషయాలు బహిర్గతపర్చింది. రాష్ట్రంలో దారిద్ర్యరేఖ దిగువనున్న వారి సంఖ్య 51.6 శాతం కుటుంబాలుగా తేల్చింది. గ్రామసభలు జరుపగా ఈ సంఖ్య 55శాతానికి పెరిగింది. ప్రభుత్వం మాత్రం దారిద్ర్యరేఖ దిగువన ఉన్న వారి సంఖ్య 36శాతంగాను, అటు తర్వాత 26కు ఆ తర్వాత 18శాతానికి తగ్గిపోతుందని ఊదరగొడ్తున్నారు. - ఒకవైపు దారిద్ర్యం పెరిగి రోజు వారి పూటగడవని దుస్థితి ఏర్పడుతుంటే, వలసలు కొనసాగుతుంటే దళితుల పిల్లలు పాఠశాలలకు వెళ్లడం ఊహించగలమా? ప్రాథమిక విద్యాస్థాయిలోనే పాఠశాలలకు వెళ్ళనివారు ఉన్నత విద్యకు ఎలా వెళ్తారు. నేడు ప్రచారం చేసే కంప్యూటర్ విద్య, ఎం.సి.ఎ., ఎం.బి.ఎ, డాక్టర్లు, ఇంజనీర్లు, ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్, ఐ.ఎఫ్.ఎస్ లాంటి ఉన్నత విద్యావకాశాలకు దళితులు నోచుకుంటారా? ఎక్కడో ఎవరో ఒకరో, ఇద్దరో దళితులు చదువుకుంటే వారి గురించి ప్రచారం గావిస్తే దళితులందరికి విద్య వస్తుందా?

నేడు సమాజంలో దుష్పరిమాణాలకు కారణం అవిద్యేనన్నది అందరూ చెప్తారు. మరి అలాంటి పరిస్థితి నుండి బైటపడటానికి ఆ విద్యనెందుకు పారద్రోలే ప్రయత్నం చేయరు? ఇది యాదృశ్చికం గానీ, అవకాశాలు లేకపోవడం గానీ కాదు.

ప్రభుత్వాలు, పాలకవర్గాలు ఒక క్రమపద్ధతిలోనే ఆ విద్యా వ్యవస్థను కొనసాగిస్తున్నాయి. గత ప్రభుత్వాలు, నేటి ప్రభుత్వాలు ఆచరిస్తున్న ప్రపంచ బేంకు విధానాలే ఇందుకు కారణం. బహుళజాతి సంస్థల లాభాలకు ప్రైవేటీకరణ అమలు జరుపుతున్నారు. అందులో భాగమే విద్యారంగం ప్రైవేటికరణ (కార్పోరేటీకరణ). ఉన్నత పాఠశాలల వరకు ఉచితంగా అమలు జరిపించాల్సిన విద్యా బోధనను ప్రైవేటికరిస్తే ఫలితాలు నేటి విధంగా కాక మరోవిధంగా ఉంటాయా? ప్రైవేటీకరణ ఫలితంగానే గ్రామీణ కొనుగోలు శక్తి దిన, దినం కునారిల్లుతున్నది. ప్రస్తుతం నిత్యకృత్యమైన ఈ కుటుంబాల పిల్లలను ఆదాయ వనరులుగా చూస్తున్నారే తప్ప వారిని బడికి పంపగల్గిన స్థితి నుండి నేటి దళిత కుటుంబాలు దూరమవుతున్నాయి.

*(➜ తరువాయి 10వ పేజీలో ..... )*

# రాజకీయ ఎజెండాగా విద్య

...✍ - డా॥ పట్టా వెంకటేశ్వర్లు

ఏ సామాజిక విప్లవోద్యమానికైనా ఆ సమాజంలో ఎక్కువ అణచివేతకు, దోపిడికి గురైన వారి సమస్యలే ప్రథమ ఎజెండాగా వుండాలి. భారత దేశ రాజకీయ ఉద్యమాల చరిత్రలో దళితులకు సంబంధించినంత వరకు విషాదకరమైన పరిస్థితే కనిపిస్తుంది. ఒక్క అంబేద్కర్‌ను మినహాయిస్తే ఏ సామాజిక, రాజకీయ ఉద్యమంలో కూడా దళితులకు సంబంధించిన సమస్యలు ప్రథమ ఎజెండాగా లేవు. అందరి సమస్యలాంటివే దళితుల సమస్యలూ అనే దృష్టి కోణంలో చూడబడటం వల్ల ఈ 58 ఏండ్ల స్వాతంత్ర్య భారతంలో దళితులకు సంబంధించి ఏ ఒక్క సమస్య కూడా పరిష్కరించబడిన పరిస్థితి లేదు. కొన్ని సమస్యలకు వున్న సంక్లిష్టత వల్ల అవి దీర్ఘకాలిక ఎజెండాలుగా ఉన్నాయంటే అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకి దళితుల భూమి సమస్య. మన దేశంలో జరిగిన సామాజిక ఉద్యమాల వల్ల భూసంబంధాలలో మార్పులు జరిగినా, ఆ ఉద్యమాలలో దళితుల ఎజెండాలు లేకపోవటం వల్ల దళితుల భూమి సమస్య ఈనాటికి కూడా పరిష్కరించబడకపోవటమే కాక అది చాలా సంక్లిష్టమైన సమస్యగా మారింది.

ఒక్క మాటలో చెప్పాలంటే భూ సమస్య అనేది కేవలం దళితుల సమస్యగా మారింది. ఇప్పుడున్న పరిస్థితిలో వ్యవసాయరంగంలో ఒక భయంకరమైన సంక్షోభం వస్తే తప్ప భూమి దళితుల దరికి వచ్చే పరిస్థితి లేదు. భూమి దళితుల సమస్యగా వుంది కాబట్టే భూపోరాట ఉద్యమాలు 50, 70 దశకంలో జరిగిన తీవ్రమైన ఉద్యమాల లాగా రూపుదాల్చడం లేదు. భూ సమస్య ఇంత సంక్లిష్టంగా వుంది కాబట్టే దీర్ఘ కాలిక ఎజెండాగా ఉంది. మరి విద్య కూడా భూ సమస్య లాంటిదేనా? ఇది కూడా దీర్ఘకాలిక ఎజెండాగా వుండాల్సిందేనా? ఇలా దీర్ఘకాలిక ఎజెండాగా వుంచబడడంలో ప్రభుత్వాల వైఫల్యంతో పాటు, ఇక్కడి రాజకీయ ఉద్యమాలు, కార్మిక సంఘాల పాత్ర ఎంత? అసలు దళితుల విద్య సమస్యను ఎలా అర్థం చేసుకోవాలి? వివిధ దేశాల అనుభవం ఎలా వుంది. ఈ సమస్యను గుర్తించడంలో ఎక్కడ గండి పడింది? ఇలాంటి ప్రశ్నలు సహజంగానే ముసురుకుంటాయి.

ప్రాథమిక విద్య వ్యాప్తిలో వివిధ దేశాల అనుభవాలను పరిశీలించినపుడు యూరప్‌లో పారిశ్రామిక విప్లవానికి ముందే సాంస్కృతిక పునర్జీవ ఉద్యమాల కాలంలో బీజం పడింది. ముఖ్యంగా ప్రొటెస్టెంట్ ఉద్యమం ప్రతి ఒక్కరు బైబిల్ చదవగలగాలన్న నిబంధన వల్ల అక్కడ చర్చి ఈ బాధ్యతను స్వీకరించడం జరిగింది. అలాగే ఆదేశాల ఆర్థిక వ్యవస్థ నిరంతర విస్తరణకు, కొత్త తరం, కొత్త వృత్తులు లేదా పనులు చేపట్టడానికి విద్యార్జన కీలకమని, కేవలం విద్య వల్లనే ఆ మార్పు సాధ్యమవుతుందని, పారిశ్రామిక దేశాలు గుర్తించాయి. ఇలాంటి చారిత్రక సమయంలోనే పారిశ్రామీకరణ చెందుతున్న ప్రతి దేశం నిర్బంధ విద్యను ప్రవేశపెట్టాయి. ఉదాహరణకి యూరప్‌లో మొదట స్కాట్‌లాండ్, ప్రష్యా, ఆస్ట్రియా, స్వీడన్ ఆ తర్వాత ఫ్రాన్స్, ఇంగ్లాండ్, ఇటలీ దేశాలు ప్రాథమిక విద్యని నిర్బంధం చేసాయి. మన దేశంలో ఇలాంటి అభివృద్ధికరమైన చరిత్ర లేకపోవటం వలన మన ఈ సమస్య నేటికి కొనసాగుతూనే వున్నది. దీనికి ఉదాహరణ. 2001 జనాభా లెక్కలను పరిశీలిస్తే బోధపడుతుంది. సాధారణ అక్షరాస్యత 65 శాతం కాగా దళితులకు సంబందించినంత వరకు 50 శాతాన్ని కూడా మించడం లేదు. దళిత మహిళల విషయంలో మరింత దారుణంగా వుంది. రాజ్యాంగకర్తలు 1960 నాటికే సార్వత్రిక విద్య సాధించాలని ఆదేశిక సూత్రాలు ఆర్టికల్ 41లో చెప్పటమే కాక, షెడ్యూల్ కులాల ప్రయోజనాలను, ప్రత్యేక శ్రద్ధతో పెంపొందించాలని (ఆర్టికల్ 46) కూడా చెప్పారు. పాపం వారు విద్య ఒక సుదీర్ఘకాలిక ఎజెండాగా వుంచబడుతుందనే విషయాన్ని వారు ఊహించి వుండకపోవచ్చు.

దళిత కులాల విముక్తి, మౌళిక మార్పుకి, ఒక ఎత్తుగడగా, లేదా ఓ మలుపుగా విద్యను అర్థం చేసుకోవటంలో పూడ్చబడన టువంటి అగాధం ఇక్కడి ఉద్యమాలలో కనిపిస్తుంది. రాజకీయ పార్టీలు ఈ సమస్యను ఎలా అర్థం చేసుకుంటాయనే విషయానికి వచ్చినపుడు ముఖ్యంగా వామపక్ష రాజకీయ ఉద్యమాలలో విద్య అతి ముఖ్యమైన సమస్యకాదు. వారి దృష్టిలో భూ సమస్యే కీలకమైంది. ఈ సమస్య పరిష్కరించబడితేనే మిగతా అన్ని సమస్యలు పరిష్కరించబడతాయనే వైఖరి వల్ల విద్య ఒక రాజకీయ ఎజెండాగా లేకుండా పోయింది. దానికి తోడు విద్య అందరి కంటే కూడా ఎక్కువ అణచివేతకు, వివక్షకు గురై, ఏ ఆదరువు లేని దళితులకు దీని అవసరం చాలా ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని గుర్తించడంలో కూడా అవగాహన లేమి అన్ని ఉద్యమాలలో కనిపిస్తుంది.

విద్య యొక్క అవసరాన్ని గురించి ప్రొఫెసర్ అమర్త్యసేన్ విశ్లేషిస్తూ, విద్య ప్రాధాన్యతనీ వ్యక్తి జీవితంలోను, అదే విధంగా సమాజంలోను ఐదు ప్రయోజనాలను కలిస్తుందంటాడు. అవి.

1. విద్య వ్యక్తి సామర్థ్యాన్ని, సాధనా శక్తినీ పెంచుతుందనీ, ఫలితంగా సమాజంలో వ్యక్తి స్వేచ్ఛగా జీవించే అవకాశాన్నిస్తుందంటాడు.
2. చదువు వ్యక్తికి అనేక ఇతర విషయాలలో కూడా అంటే ఉపాధికి, ఆర్థిక అవకాశాలు వినియోగించుకోవటంలో ఉపయోగపడి తద్వారా వ్యక్తిగత స్వేచ్ఛను పెంచడానికి కీలకమైన భూమికను నిర్వహిస్తుంది.
3. అక్షరాస్యత, ప్రాథమిక విద్య సమాజంలో వివిధ అంశాలపై విస్తృతమైన ప్రజా చర్చకు అవకాశమిస్తుంది. ప్రజలు సమిష్టిగా తమ హక్కుల కోసం పోరాడే శక్తినిస్తుంది. ఫలితంగా ప్రజలకు అందుబాటులో ఉన్న సదుపాయాల వినియోగం పెరుగుతుంది.
4. ఇతర సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి అంటే ప్రజల

మధ్య సాంఘిక సమానత్వానికి, వ్యక్తిత్వ వికాసానికి, ప్రత్యేకించి స్త్రీలు, దళితులకు ఎంతగానో ఉపకరించటంతో పాటు, బాలకార్మిక వ్యవస్థను కూడా నిర్మూలిస్తుంది. 5. అణగారిన వర్గాలలో దోపిడీ, దౌర్జన్యం, పీడనలకు వ్యతిరేకంగా పోరాడే శక్తినిస్తుంది. తమ హక్కుల సాధన కోసం ఈ వర్గాల సామాజిక, రాజకీయ సమీకరణలను పెంచుతుంది. ఇంతటి శక్తి కలిగిన ఆయుధాన్ని దళితులకు అందించడంలో ఉద్యమాలు వైఫల్యం చెందాయనే చెప్పాల్సివుంది. భారతీయ సామాజిక, ఆర్థిక, కుల నియంత్రణ వ్యవస్థలో దళితులకు వెసులుబాటు వున్న రంగం ఏదైనా వుందంటే అది విద్యారంగమే. కాబట్టి దళితులకు సంబందించినంత వరకు విద్యని భారతదేశ ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పునాది అంశంగానే చూడాలి.

పార్లమెంట్ చేసిన 93వ రాజ్యాంగ సవరణ వల్ల ఉచిత నిర్భంధ విద్యను ప్రాథమిక హక్కుగా పొందే అవకాశం అందరితో పాటు దళితులకు కూడా కలిగింది. అయితే ఈ హక్కు ద్వారా దళితులు ఎలాంటి నాణ్యత కలిగిన విద్య పొందబోతున్నారనేది ఒక ముఖ్య సమస్యగా నిలిచింది. ఎందుకంటే విద్యారంగంలో గతంలో కంటే కూడా సామాజిక అసమానతలు చాలా వేగంగా పెరుగుతున్న కాలం ఇది. గతంలోనే భారతదేశంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలో నడుస్తున్న వివిధ రకాల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అవి 1. విద్యా పన్ను వసూలు చేయడం ద్వారా పట్టణాలలో నడిచే మున్సిపల్ పాఠశాలలు, 2. రాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖ ఆధ్వర్యంలో నడిచే హయ్యర్ సెకండరీ పాఠశాలలు, 3. ప్రభుత్వ నిధులతో నడిచే ఎయిడెడ్ పాఠశాలలు, 4. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కొరకు విద్యా మంత్రిత్వ శాఖ నడిపే కేంద్రీయ పాఠశాలలు, 5. ప్రభుత్వ గుర్తింపు పొంది ఫీజులు వసూలు చేసే ప్రయివేట్ పాఠశాలలు మరియు రాజీవ్‌గాంధి చదువుకున్న డూన్ స్కూల్, సెయింట్ కాన్వెంట్ స్కూల్ గతంలోనే వుంటే గత 15 ఏళ్ళ నుండి ఫీజు వసూలు చేసే ప్రయివేటు ఇంగ్లీషు మీడియం పాఠశాలలు, వీటి ఐదు నక్షత్రాల స్కూల్స్ మొదలుకొని గ్రామీణస్థాయి ప్రైవేట్ స్కూల్స్ వరకు విరివిగా పెరిగాయి.

ఈ రకమైన స్కూల్ పద్ధతి వల్ల సామాజిక అంతరాలు మరింతగా పెరిగాయని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రక్రియ కుల చక్రం మరింతగా స్థిరీకరించ బడటానికి దోహదపడుతున్నది. ఒక మాటలో చెప్పాలంటే దళితులు ఇతరులతో పాటు సమాన స్థాయి విద్యా అవకాశాన్ని పొందే పద్ధతికి గొడ్డలివేటు పడింది. ఇంతటి తీవ్ర అసమానతలు సృష్టించే ప్రాథమిక విద్యా విధానం సామ్రాజ్యవాద దేశాలైన బ్రిటన్, అమెరికాలలో కూడా లేదు. ఆ దేశాలలో ఇవ్వాల్టికి కూడా ప్రాథమిక విద్య ప్రభుత్వ రంగంలోనే వుండటమే కాక, "నైబర్‌హుడ్ స్కూల్ పద్ధతి అమెరికాలో అమలు చేయబడుతుంది. అక్కడ వున్న కొద్ది పాటి ప్రైవేట్ స్కూల్స్ కంటే ఎంతో సమర్ధవంతంగా ప్రభుత్వ పాఠశాలలు నడుస్తున్నాయి.

మరి మనదేశంలో దీనికి పూర్తిగా వ్యతిరేక పరిస్థితి వుండటం వల్ల దళితులు కనీస మౌళిక సదుపాయాలు లేని, నాణ్యత ప్రమాణాలు అడుగంటిన ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాల్సిన దౌర్భాగ్యపు పరిస్థితి నెలకొని వుంది. అందుకని ఒక హేతుబద్ధమైన ప్రత్యామ్నాయం వెతకాల్సి వుంది. అయితే ఇటీవల ఢిల్లీ హైకోర్టు ప్రవేట్ స్కూల్స్‌లో కూడా 20 శాతం సీట్లు ఉచితంగా పేదవారికి ఇవ్వాలని తీర్పు చెప్పింది. ఎడ్యుకేషన్ బిల్లు 2005లో కూడా ఈ ప్రతిపాదన చేయబడివుంది. అయితే ఈ 20 శాతం సీట్లు ఏ పేదలకు ఇస్తారనే సంశయం వుంది. కాబట్టి అలా కాకుండా దళితుల జనాభా దామాషాను బట్టి వారిలో పేదరికపు అడుగున వున్న వారికి సీట్లు కేటాయించాలి. అలాగే ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుచున్న ప్రతి దళిత విద్యార్థికి ప్రైవేట్ స్కూల్స్‌తో పోటీపడే విధంగా వారందరికి రెసిడెన్సియల్ స్కూల్ విద్యా సౌకర్యం ప్రభుత్వమే అందించాలి. ఈరకంగా దళితులకు నాణ్యమైన విద్య అందించడానికి నిధులను కేటాయించడం, ప్రభుత్వానికి అసాధ్య మైన విషయమేమీ కాదు.

ప్రాథమిక విద్య విషయంలో ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగట్టడంలో ప్రత్యేకించి రాజకీయ పార్టీల వైఫల్యాన్ని అమర్త్యసేన్ ఎత్తి చూపుతూ "మన సమాజంలో అతి బలహీనమైన వర్గాల వారున్నారు. వారికి ప్రాథమిక విద్య చాలా అవసరం. కాని వారికి అనుకూలంగా ఏ రాజకీయ పార్టీ ప్రభుత్వంపై వత్తిడి చేయకపోవటం వల్ల బలహీన వర్గాల విద్యా విషయంలో విధాన నిర్ణయం బలహీనంగా వున్నది. కాబట్టి ప్రణాళికల్లో ఉన్నత విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటం వల్ల ప్రాథమిక విద్యారంగానికి, అక్షరాస్యత వ్యాప్తికి తగిన ప్రాధాన్యత లభించటం లేదు. పైగా అన్ని సౌకర్యాలు గల అగ్రకులాలు ఉన్నత విద్య యొక్క విస్తరణ కోసం మరింత గగ్గోలు పెడుతుంటారు. ఉన్నత విద్యకు అనుకూలంగా పనిచేసే వర్గాల వల్ల అగ్రకులాలకే బాగా ప్రయోజనం చేకూరింది. రాజకీయంగా వారికి బలం వుంది కాబట్టి తమ ప్రయోజనాలను సాధించు కుంటారు. ఈ విధంగా అణగారిన వర్గాలకు సంబంధించిన ప్రాథమిక విద్య పట్ల ఇంత నిర్లక్ష్యం జరుగుతూ వున్నా కూడా ఏ రకమైన రాజకీయ నిరసనలు వ్యక్తం కావటం లేదు. అదే పట్టణాలలో సౌకర్యాలు సరిగా లేవనో, అధిక ధరలనో, ప్రపంచ బ్యాంకు వ్యవహారం వంటి విషయాలలో ఏ ఒక్కటైనా చాలా పెద్ద రాజకీయ యుద్ధమే చేస్తాయి.

"దీన్ని బట్టి అర్థమయ్యేది ఏమంటే ప్రాథమిక విద్యారంగాన్ని ఇంత అశ్రద్ధ చేసినా ప్రభుత్వం ఇంత సులువుగా తప్పించుకోవటానికి కారణం రాజకీయ ఉద్యమాలు ఈ సమస్యను పట్టించుకోకపోవటం వల్లనే ఈనాటి ప్రైవేటీకరణ యుగంలో కూడా ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేయమని సాక్షాత్తు ప్రపంచ బ్యాంకు కూడా కోరటం

(☛ తరువాయి 10వ పేజీలో ..... )

( 9వ పేజీ తరువాయి ..... )

లేదు. పైగా వివిధ దేశాల నుండి ప్రాథమిక విద్యకు (డిపిఇపి) నిధులు అధికంగానే వస్తున్నాయి. అయితే ఈ నిధులు సక్రమంగా ఉపయోగపడే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత కూడా వుంది. అదేవిధంగా పాఠశాల నిర్వహణ, టీచర్ల పనితీరుపై కూడా జాగురూకతతో సంఘాలు, దళితులు బాధ్యతగా పర్యవేక్షించాలి.

ఈ రకంగా నాణ్యమైన విద్యను పొందటం కోసం ఒక తీవ్రమైన ప్రయత్నం ప్రారంభం కావాల్సి వుంది. ఈ ప్రయత్నాలు 1960 నాటికే, పోనీ 80వ దశకం నాటి కన్నా జరిగి వున్నట్లయితే ఈ దేశంలో దళితుల పరిస్థితి వేరే విధంగా వుండేది. ఈ విషయంలో మణిపూర్ తీవ్రవాదులు చాల ఆదర్శవంతమైన కార్యక్రమాన్ని చేపట్టారు. నాణ్యమైన విద్య కోసం పాఠశాలలపై పర్యవేక్షణ జరుపుతున్నారు. విధులకు ఎగనామం పెట్టే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటున్నారు. విద్యా సౌకర్యాల గురించి ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో చర్చిస్తున్నారు. పేరులోనే విప్లవాన్ని రగిలించుచున్న గ్రూపులు మొదలుకొని అన్ని రాజకీయ పార్టీలు వీరిని ఆదర్శంగా తీసుకోవాలి.

ఈ సందర్భంగా డా॥ అంబేద్కర్ చేసిన హెచ్చరికను మనం సదా గమనంలో వుంచుకోవాల్సి ఉంది. "ఏ సమాజంలోనైనా ప్రాథమిక విద్యా అవకాశాలు మరియు అక్షరాస్యత అనేవి పెరగకుండా ఆ సమాజంలో విజ్ఞానం విస్తరించటం అనేది జరగని పని. మరి ముఖ్యంగా సామాజిక అంతరాలు తీవ్రంగా ఉన్న సమాజంలో ప్రాథమిక విద్య విస్తరించబడకుండా అన్ని రకాల సదుపాయాలు లేదా ప్రయోజనాలను (ఆర్థిక, సాంఘిక, రాజకీయ) పొందటమనేది సాధ్యమయ్యే పని కాదు. అలాగే ప్రస్తుత యువతరం నూతన ఆలోచనలు, అనుభవాలు మరింత పరిపుష్టి చేసుకోవటానికి ఈ ప్రాథమిక విద్యతోనే సాధ్యమవుతుందని గుర్తించలేకపోతే వారు వికాసం లేని బానిసలుగా ఉంచబడతారు." ఏమైనప్పటికీ ప్రాథమిక విద్యకోసం ఉద్యమం ఆరంభించక తప్పదు. అందుకని దీనిని అతి ముఖ్యమైన రాజకీయ సమస్యగా చేయాల్సి వుంది. "కేవలం విద్య వల్ల మాత్రమే దళిత జాతి ప్రగతి సాధించ గలుగుతుంది. నిజంగా మనం దళితుల ప్రగతిని కోరుతున్నట్లయితే, వారు నాణ్యమైన విద్య సాధించుకునే క్రమం గురించి, దాని వల్ల కలిగే ప్రయోజనాలు, అది లేకపోవటం వల్ల జరిగే అనర్థాల గురించి, దాన్ని ఒక హక్కుగా గుర్తించే విధంగా మన వారందరినీ చైతన్యవంతుల్ని చేయాల్సిన అవసరం నేడు ఎంతైనా వుంది. అదే సమయంలో రాజకీయ పార్టీలలో ప్రాథమిక విద్యను ఒక ఎజెండాగా చేసే ప్రయత్నం జరగాలి. ఈ విధంగా విద్యని రాజకీయ ఎజెండాగా చేయించటమే దళిత శక్తుల ముందున్న ప్రధాన కర్తవ్యం. ●

( 7వ పేజీ తరువాయి ..... )

దళితవాడలో అక్కడక్కడా పాఠశాలలు ఉన్నా దాని బాగోగులు చూచే విధంగా నిర్వహణ లేదు. అనేక వాడలలో పాఠశాలలే లేవు. ఉపాధ్యాయులు లేరు. వర్షాకాలం వస్తే పిల్లలు పనులకు పంతుళ్ళు ఇండ్లకు అన్నట్లుంటుంది దళితవాడ పాఠశాలల స్థితి గతంలో పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. మరి ఆ ఎన్నికలలో దళితులకు రిజర్వేషన్లున్నాయా? ఎంతమంది దళితులు పాఠశాల కమిటీలకు ఎంపికైనారు. వాళ్ళలో ఎన్నికల గురించి కాకుండా వీరి పిల్లల గురించి, వారి స్థితిగతుల గురించి ఆలోచించే వారెవరు?

రాష్ట్ర సంక్షేమ శాఖ తీరుమారాలి. జూనియర్ కాలేజీ వరకు దళితులందరికి ఉచిత విద్యాబోధన జరిపే విధంగా ప్రణాళిక రచించి అమలుచేయాలి.ఉచిత విద్యా బోధనంటే ఏ వసతులు లేని విద్యా సంస్థలు కావు - అన్ని హంగులు గల్గిన విద్యాసంస్థలను ఏర్పరచాలి. ప్రతి దళిత వాడలో ప్రాథమిక పాఠశాల ఉండాలి. జనాభాను బట్టి ఉన్న పాఠశాల ఉండాలి. అందరికీ ఉచిత భోజనం, బట్టలు, పుస్తకాలు ప్రభుత్వమే సరఫరా చేయాలి. దళిత పిల్లల తల్లిదండ్రులతో పాఠశాల కమిటీ వేసి వారు చేసే సూచనలను ప్రభుత్వం అమలుచేసే విధంగా ఉండాలి. వృత్తి విద్యాకోర్సులు, టెక్నికల్ విద్యా కోర్సులలో ప్రాధాన్యత ఇవ్వాలి. విద్యాభ్యాసం పూర్తయ్యాక బేంకులు ఆర్థిక సహకారం కల్పించాలి. ఆ విధంగా కల్పించబడే సహాయంతో స్వతంత్ర వృత్తులు కొనసాగటానికి అవకాశమివ్వాలి. బాలికల చదువుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి. పట్టణ ప్రాంతాలలోని మురికి వాడలలోను, గ్రామీణ ప్రాంతంలోని దళితవాడలోను చదువుకొనుటకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలి. పిల్లల ఆరోగ్యాలు పరీక్షించి అందరికీ "ఆరోగ్య కార్డులు" ఇవ్వాలి. పాఠశాలలో ఆట-పాటలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలి.

ముఖ్యంగా ఇందుకు కావాల్సిన బడ్జెటును రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు కేటాయించడం ద్వారానే ఇది సాధ్యం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెటు కేటాయింపులు పెంచకుండా తగ్గిస్తున్నది. - విద్య క్రీడారంగం, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలకుమొత్తం బడ్జెటులో 2004-05 లో రూ. 708.38 కోట్లు (5.33శాతం) కేటాయించగా దానిని రివైజు చేసి (621.56 కోట్లు) (4.85శాతానికి) తగ్గించారు. 2005-06 సంవత్సరానికి రూ. 728.90 కోట్లు (4.66శాతం) గా కేటాయించారు. బడ్జెటు మొత్తం పెరిగినా కేటాయింపు శాతం తగ్గుచున్నది - ఇది మొత్తం విద్యారంగానికి సంబంధించిన బడ్జెటు - ఇలా తగ్గుతున్న బడ్జెటులో దళితులకు కేటాయించే బడ్జెటు ఎలా తగ్గుతుందో ఊహించని అంశమేమీకాదు.

ఎక్కడ పెట్టుబడి పెడ్తామో అక్కడే ఫలితాలు వస్తాయి - ఎక్కడ పెట్టుబడి పెట్టలేమో అక్కడ ఫలితాలు ఊహించలేము. అందుకే ప్రభుత్వం దళితుల చదువుపై తగినంత కేటాయింపులు చేసినాడే అందరికి విద్యాగంధం అబ్బుతుంది-లేనిచో ప్రస్తుత పరిస్థితి మరింత దిగజారుతుంది. ఇప్పటికైనా ఈ విషయాన్ని ప్రభుత్వం పాలకులు గుర్తించాలని ఆశించడంలో తప్పులేదు. ●

# బతుకు దెరువు సదువులు

## ('వృత్తి విద్య' కోర్సులు)

...✍ - యం. వేణుగోపాల్

వృత్తి విద్య అంటేంది? దాని అర్థం ఏదన్న గావచ్చుగని, బతుకు దెరువుకు అదొక దారి.

జీవి ఏదన్న గాని బతుకాలనుకుంటది. బత్కుకోసం తన్నుకలాడ్తది. జీవిని బట్టి బత్కుంటది. బత్కు అర్థంగూడ మార్తది.

మనిషీ బతుకాలనుకుంటడు. గని, మిగిలిన జీవుల బతుక్కు మనిషి బతుక్కు చాన తేడ ఉన్నది. మిగిలిన జీవులల్ల తల్లిగుంపుకున్న తెలివిదప్ప పిల్లగుంపుకు అంతకు మించి తెలివిరాదు. అసలుకు ఏ మాత్రం తేడ ఉండదని అనుడు తప్పుమాటయితదిగని, మనకండ్లకు మాత్రం జెరంత తేడగూడ గనవడది. మనుషుల ముచ్చట అట్లుండది. మనుషుల పిల్ల గుంపులు ఏ తరానివైనా పెరిగే కొద్ది తల్లిగుంపుకంటె ఎక్కువ నేర్సుకుంటయి. తల్లిగుంపు ఊహలకు, కలలకు గూడ రానివాటిని నేర్చుకుంటయి. తరతరాల మనిషికథల ఇది కొత్తముచ్చటేంగాదు.

ఇంత సక్కటి గునం మనిషి జీవికే - మనిషి గుంపుకే ఎందుకచ్చినట్టు? మాయ మర్మమెరుగని కొందరు బుద్ధిమంతులు బాగసదివి, ఎనుకటి రోజుల లోతులు తెల్సుకుని దీనికి జవాబు దొరకవట్టింౖడు. డార్విను, ౖఫెడ్రిక్ ఎంగెల్సులు దీని గురించి పని చేసి సక్కటి ముచ్చట జెప్పింౖడు. జీవరాసుల నుంచే రకరకాల మొలక లేసుకుంట కోతివుట్టుకచ్చింది. గా కోతిలకెల్లే మనిషి పుట్టిండు. పనిజేసుడు అనే ఒక కొత్త అలవాటు వచ్చినందుకే మనిషి పుట్టుక మొదలైంది. గా పనిచేసె గునమే మనిషిని ఈ నాడున్న ఆకారానికి గూడ తీర్చిదిద్దింది. కాళ్లేతులు, నిటారుగున్న ఎన్నుపూస, బహు చాకచక్యం తోటి గదిలే ఈ మొత్తం మనిషి పెయ్యి, దాంట్లుండె అంగాలన్ని ఈ తీరుగ తీర్చిదిద్దినట్టుండుటానికి కారణం పనిజేసే గునమే అని జెప్పింౖడు. ఇప్పటి వరకు తెలిసిందాన్ని బట్టే గిదేనిజం గూడ.

ఈ పనిజేసె గునం మనిషి మెదడుపనిచేసే తీరును గూడ మార్చింది. ఆలోచనలు మారినయి. ఆలోచనల తీర్లూ మారుకుంటస్తున్నయి. అండ్లకెల్లె మాట, రాత, భాష, పుట్టింది. ఆ భాషను ఆసర జేసుకోని సదువులచ్చినయి. సదువులతోటి మెదడుపదును ఇంక ఎంతొపెరిగింది.

సదువుతోటి మెదడుకు పదునువెట్టి ఆపదునుతోటి, చేసే పనికి ఇంకింత పదునెవెట్టినప్పుడు పనికి ఫలితం బెరుగుతది. గందుకె ఎక్కువజీతాలు, తక్కువజీతాలు మొదలైనయి.

ఎవ్వలైన సరే బతుకుదెరువుకు పనిజెయ్యవల్సిందే. అయితే, సదువులనేటియి లోకంలకచ్చినంక ఒక తేడ వచ్చింది. అదే, "సదువుబలం" ఉన్నపని - 'సదువుబలం' లేనిపని. ఫర్వాలేదు. మంచిదే, గని, సదువుబలం కొందరికే దక్కింది. గిది పెద్ద పొరపాటు. సదువులు వచ్చేటప్పటికి సంగంల ఉన్నోల్లు, లేనోల్లు అనే తేడ వచ్చింది. సదువులు ఉన్నోల్లకే దొరికినయి. సదువుబలంగూడ ఉన్నోల్లకె దక్కింది. గందుకె మంచి జీతాలచ్చె కొలువులు గూడవాల్లకె దక్కుతున్నయి. దునియ మొత్తంల అన్ని దేశాలల్ల గిట్లనె జరిగింది. గని, మన ఇండియల మాౖతం ఇంకా ఘోరమైన అన్యాయపు తేడలచ్చినయి. ఉన్నకులపోల్లు - లేనికులపోల్లు అనే తేడ. తేడ ఒక్కటె గాదు పుట్టుకతోనే ఆ తేడ. మధ్యల మారేదీ గూడ లేదు. గింతగనం దుర్మార్గం మనువు అనే బాపనోని బుౖరల వుట్టింది. సకల సంపదలు, సకల పెత్తనాలు, సదువుకు గావల్సిన సకల అవకాశాలు, హక్కులు బాపనోల్లకె, రాజుల, దొరల కులాలోల్లకె మిగిలినయి. మిగిలినోళ్ళకు చెవులల్ల సీసం, కండ్లల్ల కత్తులు, ఏల్లు దెగిన చేతులు, తలలు లేని మెడలు మిగిలినయి. ఈ అన్యాయపు కులకట్టుబాట్లతోటి లేనికులాలోల్ల బత్కులు ఘోరంగ నలిగినయి. నలిగిపోతున్నయి.

ఎంతనలిగినా, ఎంత మనిషైనా లేని కులం మనిషిగూడ జీవేగదా. జీవి బత్కాలెగద. మనిషి తీర్గ గూడ బత్కాలెగద. అందుకని తన్నుకులాడిండు. అంతాగలిసి తన్నుకలాడింౖడు. జెరంత ఊపిరాడెటట్టు ఏర్పాటు జేసుకున్నరు. గీతన్నుకులాట దారిలనే బాబాసాహెబ్ అంబేద్కర్ గొప్ప గొప్ప పనుల జేసిండు. కులంకట్టుబాట్లమీద బహురూపాలుగ దెబ్బదీసిండు. లేనికులాలోల్లకు రిజర్వేషన్లు, ౖపత్యేక వసుతులు రాజ్యాంగబద్ధం చేసిండు. 'కులనిర్మూలన' దారి సూపిండు, చానవివరంగ రాసిపెట్టిపోయిండు. తిండితిప్పలుకే ఎంతోకష్టంగ ఉన్న మన కులాలల్లపుట్టి పట్టుదలతోటి పైసదువులు సదివిండు. తన మార్గానికి గూడ ఈ సదువుతోటి ఎంతో బలం సంపాయించిండు.

అందుకని, మనం గూడ సదువుకోవాలె. మనకోసం, మనలేనికులాలోల్ల కోసం సదువు కోవాలె. ఎంతో పై సదువులు గూడ సదువాలె. పై సదువులంటె ఎంతదాక? ఎంతదాకైన గావచ్చు. దానికి అంతమేడిది? బతికినంత కాలం జదివినా సాలది.

మరి! బతుకుదెరవో?

అదే, గందుకె పనిజెయ్యాలె. సదువు బొత్తిలకే లేని పనిగాకుండ, జెరంతన్న సదువున్న పనితోటి మొదలుపెట్టాలె. పనిజేసుకుంట బత్కాలె, బతుకుక్కుంట సద్వాలె. ఒకటె పట్టు ఏడ ఆగకుంట బాగ పైదాక సదువుకునేటోల్లకే బాగ సరిపొయెటట్టున్న సదువు తీర్లల్ల మనం ఏదొజెరంత దూరం జదివి ఆపితె అటీటుగాకుండా ఆగమైతం. మనం సదువుకోగల్గిన కాలంలనె, మొదటిసారి పనిలజేరె ముందరి దాక సదువుకోగల్గిన ఆకాలంలనె, అందుబాటులున్న పనిమీద మంచి పట్టునిచ్చె సదువు తీర్లుగావాలె. వృత్తి విద్యాకోర్సులంటె గివ్వె.

మనం, మనోల్లు గట్టిగ అడుకుతున్నందుకు, లోకం, కాలం మారుతున్నందుకు, కొత్త కొత్త యంౖతాలు, కంపెనీలు, వ్యాపారాలు వస్తున్నందుకు, వ్యవసాయం తీర్లు మారుతున్నందుకు ౖపభుత్వాలు ఈ కోర్సులను ఎన్నో ఏండ్ల కింది నుంచె మొదలుపెట్టింౖడు. ౖబిటన్‌ల, అమెరికాల, ఆస్ట్రేలియాల, జర్మనీల వందేండ్ల ముందటనే ఈ

(➜ తరువాయి 14వ పేజీలో ..... )

# దళితులు విద్య

...✍ - బి. నీరజ

**అందరికీ విద్య.... ప్రపంచ అనుభవాలు :** ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ (ఇ.ఎఫ్.ఎ) 2003 నివేదిక, 2000 ఏప్రిల్‌లో సెనిగల్‌లోని డాకర్‌లో జరిగిన ప్రపంచ విద్యా వేదిక (వరల్డ్ ఎడ్యుకేషన్ ఫోరమ్) సమావేశంలో 164 దేశాలు విద్యారంగంలో సాధించాల్సిన ఆరు లక్ష్యాలను ఆమోదించాయి. ఇందులో ముఖ్యమైనవి. 1. సార్వత్రిక ప్రాథమిక విద్య (యు.పి.ఇ)ను సాధించటం, 2. వయోజన అక్షరాస్యత, 3. స్త్రీ, పురుష నిష్పత్తి 4. విద్య నాణ్యతను పెంచటం అనే లక్ష్యాలను 2003 నాటికి సాధించాలని డాకర్ డిక్లరేషన్ పేర్కొంది. 94 దేశాలకు గాను ఇడిఐ (ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఐడెక్స్) ఈ నివేదికలో గణించారు. ఆ వరుసలో భారతదేశం 76వ స్థానంలో ఉంది. ఈ నివేదిక ప్రకారం 2005లోగా ప్రాథమిక, సెంకడరీ స్థాయిలో చేరే బాల బాలికల సంఖ్యను సమాన స్థాయికి తీసుకురావడాన్ని తక్షణ లక్ష్యంగా పేర్కొన్నారు. 2015 నాటికి విద్యారంగంలోని అన్ని స్థాయిల్లోనూ స్త్రీ, పురుష సమానత్వం సాధించాలని ఇఎఫ్ఎ - 2003 సదస్సు నిర్దేశించింది. అయితే అందరికీ విద్య లక్ష్యాలను సాధించటంలో వివిధ దేశాల ప్రగతిని ఐక్యరాజ్య సమితి సంస్థ అయిన యునెస్కో పర్యవేక్షించి జెండర్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ ది లీప్ టు ఎడాలిటి నివేదికను విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం 2005 నాటికి సాధించాలని నిర్ధేశించుకున్న లక్ష్యాలకు భారతదేశంతో సహా 128 దేశాల కృషిని యునెస్కో సమీక్షించింది. ఈ లక్ష్యానికి అన్ని దేశాలు చాలా దూరంగా ఉన్నాయని పేర్కొనటం జరిగింది. అంతేకాకుండా బాల బాలికలందరిని బడిలో చేర్పించటానికి పేదరికం అతిపెద్ద ఆటంకంగా వుందని ఆ నివేదిక స్పష్టం చేసింది. 2005 నాటికి విద్యారంగంలో అన్ని వర్గాల వారికి విద్యను అందించటమనేదే జరగనప్పుడు లింగ వివక్షను తొలగించటం ఎలా సాధ్యమవుతుందని ఈ నివేదిక ప్రశ్నించింది. సామాజిక మార్పును సాధించకుండా, దళిత బలహీన వర్గాలు, స్త్రీలకు విద్యను అందించకుండా లింగ వివక్షను తొలగించటం ఏ మేరకు సాధ్యమవుతుంది? 2005 నాటికి విద్యారంగంలో లింగవివక్షనే తొలగించలేనప్పుడు సహస్రాబ్ధి అభివృద్ధి లక్ష్యమైన (మిల్లేనియం డెవలప్‌మెంట్ గోల్) 2015 నాటికి పేదరికాన్ని నిర్మూలించటం ఎలా సాధ్యమవుతుంది?

**విద్యా హక్కు - భారత రాజ్యాంగం :** ప్రాథమిక హక్కుగా మారిన ఆదేశిక సూత్రం : రాజ్యాంగం అందరికీ జీవించే హక్కు కల్పించింది. ఈ హక్కు కేవలం ఆర్టికల్ 21లో ఉన్నంత మాత్రాన సరిపోదు. ఊరికే ఉండటమే బతుకు హక్కు కాదని సుప్రీమ్ కోర్టు వివరించింది. పరువుతో, తలెత్తుకుని బతకగల పరిస్థితులు కల్పించటమే ఈ హక్కు లక్ష్యమని సుప్రీంకోర్టు చెప్పవలసి వచ్చింది. బతికే హక్కులో భాగంగానే చదువుకునే హక్కు ఉందని, ప్రాథమిక విద్యా హక్కును ఇంకా ఆదేశిక సూత్రంగా భావించనవసరం లేదని, అది ప్రాథమిక హక్కుగా మారి పోయిందని సుప్రీమ్ కోర్టు స్పష్టం చేసింది. అంతేకాకుండా పిల్లలందరికి చదువు చెప్పించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సుప్రీమ్‌కోర్టు హెచ్చరించింది.

విద్యారంగం మీద పెట్టుబడులు వృధా అని, విద్యారంగం ముందు తరానికి పెట్టుబడి అని, అభివృద్ధికి ముడిసరుకు అని నమ్మినవారెవరైనా ఉంటే, ఉన్నత విద్యకు కేటాయించిన కోట్లాది రూపాయలు చూపి, విద్యారంగానికి పెద్ద పీట వేసామంటున్నారు. నిజానికి ప్రాథమిక విద్యను, నిర్లక్ష్యం చేశారు. 2000 సంవత్సరంలోగా అందరికీ విద్య అన్నారు. అదీ మరచిపోయారు. నిర్భంద ప్రాథమిక విద్య తమ విధానం అని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మానిఫెస్టోలలో రాసుకున్నాయి. కాని పాటించినవారు లేరు. ప్రాథమిక విద్య మీద దేశంలో అతి తక్కువ తలసరి పెట్టుబడి పెడుతున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌కు స్థానం ఉందని లెక్కలు చెప్తున్నాయి. రకరకాల పథకాలతో బడులలో సౌకర్యాలు పెంచి పిల్లలు బడికిపోవటానికి కృషి జరగుతున్నప్పటికీ 82.87 శాతం పిల్లలు మాత్రమే బడిలో చేరుతున్నారు. వారిలో 47 శాతం బడి మానేస్తున్నారు. అంటే దాదాపు సగం మంది బడి వదిలేస్తున్నారన్నమాట.

రాజ్యాంగంలోని 86వ సవరణ ద్వారా చిన్న పిల్లలందరికీ చదువు చెప్పవలసిన బాధ్యతను గుర్తించి ప్రాథమిక హక్కుగా పార్లమెంటు ఆమోదించింది. విద్యా హక్కుకు బాల కార్మిక సమస్యకు చాలా దగ్గర సంబంధం వుంది. విద్యలేని చోట పేదరికం ఉంటుందంటే కవిత్వంలా కనిపించవచ్చు కాని ఇదొక సామాజిక వాస్తవం. పిల్లలు బడికివెళ్ళలేదంటే ఆ సమయంలో పనికి వెళ్ళారన్న మాట. స్కూలుకు పోని పిల్లలు కూలికి వెళ్ళి ఎంతో కొంత సొమ్ము సంపాదించి కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉన్నారని అర్ధం చేసుకోవాల్సిందే. బాల కార్మికులు ఎక్కువగా ఉన్న దేశాల్లో మనదేశం ముఖ్యమైనది. మనదేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ బాల కార్మికుల్లో అగ్రగామిగా ఉంది. దేశంలోని బాల కార్మికుల్లో ఎక్కువమంది అంటే 17.8 శాతం మంది మన రాష్ట్రంలోనే ఉన్నారు. మొత్తం 19 లక్షల నుంచి 25లక్షల బాల కార్మికులు ఉన్నారని లెక్కలు చెపుతున్నాయి.

విద్యపై ప్రపంచ రిపోర్టు ప్రకారం భారతదేశం అత్యధిక నిరక్షరాస్యత ఉన్న ఏకైక దేశం. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం 1998-99 సంవత్సరానికి 38.29 శాతం మగపిల్లలు, 43.34 శాతం ఆడపిల్లలు అయిదో తరగతికి రాకముందే బడి వదిలేస్తున్నారు. మనదేశంలో 30 కోట్ల మంది పిల్లలుంటే ఏటేటా 3 కోట్ల 20 లక్షల మంది పిల్లలు జనాభా లో చేరుతున్నారు. మొత్తం దేశంలో బడికివెళ్ళే వయసున్న 11 కోట్ల పిల్లల్లో మూడోవంతు బాల కార్మికులుగా బతుకుతున్నారు. అంటే మూడుకోట్ల 20 లక్షల మంది బాలకార్మికులు చదువుకోలేక, బడికిపోలేక బండబారిపోతున్నారు. వీరిలో అత్యధికులు దళిత బహుజన వర్గాలకు చెందిన కుటుంబాలే ఉన్నారు. వీరందరికిఈ విద్య అందుబాటులోకి వచ్చినపుడే విద్యాహక్కు హక్కుగా మనగలుగుతుంది. గత విద్యా సంవత్సరం 2003-04లో ఎస్సీ విద్యార్థుల కోసం 158 కోట్ల 38లక్షల రూపాయలు కేటాయించారు. ఇందులో 2 లక్షల 77వేల మందికి పదవ తరగతి అనంతరం స్కాలర్‌షిప్పులు అందాయి. వీరందరికీ

ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పూర్తిగా అందించటం కోసం ఇంకా 63 కోట్ల రూపాయలు పెండింగులో ఉందని ప్రభుత్వం ప్రకటించింది. 2004 - 05 సంవత్సరానికి 223 కోట్ల 2 లక్షల కేటాయింపు జరిగింది. ఇందులోనుంచి గత ఏడాది ఇవ్వాల్సిన 63 కోట్ల రూపాయలను మినహాయిస్తే రు. 160 కోట్లు మిగులు అంటే విద్యార్థులు సంఖ్య పెరుగుతున్నా వారికి కేటాయించాల్సిన స్కాలర్‌షిప్‌లు మాత్రం పెరగటం లేదు.

విశ్వ విద్యాలయాల్లో వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశం దళితులకు మరింత కష్టమవుతుంది. ప్రతీ సంవత్సరం ఫీజులు పెరుగుతున్నాయి కాని అందుకు అనుగుణంగా రీయంబర్స్‌మెంట్ పెరగటం లేదు. 8 వేలున్న ఇంజనీరింగ్ ఫ్రీ సీటు సుప్రీంకోర్టు తీర్పుతో 22 వేలకు పెరిగిపోయింది. అంటే 14 వేలు పెరిగింది. కాని ఎస్సీ బిసి విద్యార్థులకిచ్చే రియంబర్స్‌మెంట్ 10 వేలు మాత్రమే ఇస్తున్నారు. మిగిలిన 12 వేలు కట్టుకునే స్థోమతలేక సామాన్య దళిత వర్గాల వారు మధ్యలోనే ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు, రీస్ట్రక్చర్ కోర్సులు చదువుకునే దళిత బలహీన వర్గాల విద్యార్థులకు 20 వేల లోపు మాత్రమే ఫీజు రియంబర్స్‌మెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గత విద్యా సంవత్సరంలో జీవో 56ను విడుదల చేసింది. దీంతో యూనివర్శిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించాలంటే దళితులకు ఈ జీవో అడ్డంకిగా మారింది. ఫలితంగా దళితులు ఉన్నత విద్యలకు దూరమైపోతున్నారు.

కంప్యూటర్ కాంబినేషన్ ఉన్న కోర్సులకు ప్రభుత్వ కళాశాలలో 7వేల రూపాయలు ఫీజు ఉంటే ప్రైవేటు కళాశాలలో 8 వేలు ఉంటుంది. సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోర్సులైన బి.ఎస్సీ, ఎం.పి.సి. (మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్) కోర్సుకు 7,280 రూ॥ ప్రభుత్వ కాలేజీలో ఉంటే 8 వేలు రూ॥లు ప్రైవేటు కాలేజీలో, మరి కొన్ని కాలేజీల్లో 8,800 రూ॥ ఉంటుంది. ఇక పునర్నిర్మాణ (రీ స్ట్రక్చర్డ్) కోర్సులుగా పిలుస్తున్న కంప్యూటర్ సైన్సు, కంప్యూటర్ అప్లికేషన్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్, మైక్రోబయాలజి, బయోటెక్నాలజి, జెనెటిక్స్ బయోకెమిస్ట్రీ వంటి వాటికి పిజి స్థాయిలో 40 వేల నుంచి లక్ష వరకూ వసూలు చేస్తున్నారు. చివరికి బి.ఎ., బి.కాం. లలో కూడా కంప్యూటర్ సబ్జెక్టు ప్రవేశపెట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఉన్నత విద్యలో వృత్తి విద్యా కోర్సులను చదవటానికి ముందుకు వస్తున్న దళిత పేద విద్యార్థులు ఇంత పెద్ద మొత్తం ఫీజులు చెల్లించలేక, సాంప్రదాయ కోర్సులు చదువుదామంటే అవి అన్ని కాలేజీల్లోను అందుబాటులో లేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఇటీవల కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కాలేజీలో ఎం. ఫార్మసీ, ఎం.ఎస్సీ, బయోటెక్నాలజీ కోర్సులలో అడ్మిషన్లకు కౌన్సిలింగ్ జరిగింది. ఈ కౌన్సిలింగులో సీటు సాధించిన కొంత మంది ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ప్రభుత్వ ఆదేశాల మేరకు 20 వేల రూపాయలు చెల్లించాల్సి ఉండటంతో, ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమతలేక సీటు వదులుకున్నారు. వైద్య విద్య విషయానికొస్తే ప్రైవేటు కాలేజీల్లో ఫ్రీసీటు 13 వేల నుంచి 15 వేలకు ఉంటే పేమెంటు సీటు 75వేల నుంచి 90వేలకు పెరిగిపోయింది. ఈ మధ్యనే జరిగిన పిజి మెడికల్ అడ్మిషన్లలో ప్రతిభగల విద్యార్థులకు అన్యాయం జరిగిపోతుందంటూ ఎస్సీ,ఎస్టీ, బిసీ రిజర్వేషన్లు అమలు చేయరాదని రాష్ట్ర హైకోర్టు తీర్పునివ్వటం దళితులను మరింత కలవరపరుస్తుంది.

గత ఐదేళ్ళల్లో రెండు మూడు రెట్లు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. కాని దళితులకు మెస్‌ఛార్జీలు, కాస్మోటిక్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెరగలేదు. యూనివర్శిటీ విద్యార్థులకు నెలకు 520 రూపాయలు ఇస్తుండగా 1000 నుంచి 1200 వరకు మెస్ బిల్లు వస్తుంది. దీంతో ప్రభుత్వం ఇచ్చే 520 రూపాయలతో 15 రోజులు మెస్‌లో తిని, మిగతా రోజులు పస్తుండాల్సిందే. 2002-03లో కంటే 2003-04 సంవత్సరంలో ప్రభుత్వం తక్కువ మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసింది. 2003 - 04 సంవత్సరంలో 9,535 మంది విద్యార్థులకు 2.24 కోట్లు స్కాలర్‌షిప్ కింద ప్రభుత్వం విడుదల చేసింది. 2004 - 05సంవత్సరంలో 11,193 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోగా 6,110 మందికి మాత్రమే 2.23 కోట్లు రూ॥ విడుదల చేసింది. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునేవారికి 10 వేల రూ॥, ప్రైవేటు కళాశాలల్లో చదువుకునే వారికి 5 వేల రూ॥ చొప్పున కట్టిన ఫీజును తిరిగి చెల్లించాల్సి (రీయంబర్స్‌మెంట్) వుంటే కేవలం 339 మంది విద్యార్థులకే 23.70 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది. దాంతో మొదటి, రెండవ, మూడవ సంవత్సరం చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందక నానా ఇబ్బందులు పడుతూ చదవాల్సి వచ్చింది. 2004 - 05 సంవత్సరానికి 34,6495 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఇవ్వాల్సి ఉంటే 24,83116 కోట్ల రూ॥ కావాల్సి వస్తుంది. కాబట్టి కేంద్రం విడుదల చేసిన వెంటనే చెల్లిస్తామని ప్రభుత్వం చెపుతుంది.

అంతేగాక 2005 - 06 సంవత్సరానికి సాంఘిక సంక్షేమ శాఖకు 1020.11 కోట్లు రూ॥ కేటాయించామని, పోస్ట్‌మెట్రిక్ ఉపకారవేతనాలు వృత్తివిద్యా కోర్సులు చదివే విద్యార్థులకు నెలకు 520 రూ॥ నుంచి 740 రూపాయలకు పెంచామని ప్రకటించటం ఆనందించదగ్గ పరిణామం. కనీసం ఈ విద్యా సంవత్సరంలోనైనా దళితులకు స్కాలర్‌షిప్పులు, రీయంబర్స్‌మెంట్ ఫీజులు సకాలంలో చెల్లించి దళితుల్లో మధ్యలోనే ఆగిపోతున్న ఉన్నత విద్యను కొనసాగించే ప్రయత్నం చేయాలి. తద్వారా అన్ని వర్గాల వారికీ విద్యనందించే సామాజిక బాధ్యతకు న్యాయం జరుగుతుంది.

విద్యా హక్కు అన్ని మానవ హక్కుల సాధనకు వెన్నెముకలాంటిది. విద్యలేనిదే మానవ హక్కుల పరిజ్ఞానాన్ని సాధించటం బహుకష్టం. అనేక మానవహక్కుల ఉద్యమాల ఫలితంగా విద్యా హక్కు భారత రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాల నుండి ప్రాథమిక హక్కుల్లోకి చేర్చబడింది. కాని ఈ ప్రాథమిక హక్కు దళిత బాలలు, బాలికలకు అందనంత దూరంలో ఉంది. పేదరికంతో బాధపడుతూ, దారిద్ర్యంతో సహజీవనం చేస్తూ, వివక్షాహింసలకు గురవుతూ దోపిడీకి గురికాబడుతున్న నిరుపేద దళిత కుటుంబాలకు ప్రాథమిక హక్కుగా మార్చబడిన విద్యా హక్కు కలగానే మిగిలింది. సమాజాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యలైన పేదరికం, నిరుద్యోగం, మూఢనమ్మకాలు, అధిక జనాభా, అంటరానితనం వీటన్నింటికీ మూలం విద్యలేకపోవటమే. ఇన్ని ప్రధాన సమస్యలకు కారణమవుతున్న విద్యపట్ల ప్రభుత్వం, పాలకులు, రాజకీయ నాయకులు నిర్లక్ష్యం వహించటం కడు విచారించవలసిన విషయం బలహీన, నిమ్న మరియు దళిత వర్గాల ప్రజల్లో మార్పురావాలంటే నాణ్యతగల విద్యను అందించటమొక్కటే మార్గం. ఎన్ని చట్టాలున్నప్పటికీ, ఎన్ని రాజ్యాంగ సవరణలు చేసినప్పటికీ ప్రభుత్వాలలో చిత్తశుద్ధి వచ్చేంతవరకూ అతి ప్రధానమైన విద్యా హక్కును హక్కుగా సాధించటం క్లిష్టతరమైన అంశమే. ●

# దళితులపై జరిగిన అత్యాచార నేరాలు - ఏప్రిల్ - 2005

**విశాఖపట్నం :** 29.03.05న పెందుర్తి మండలం ముదపాక గ్రామంలో కొండమ్మ అనే దళిత మహిళకు చెందిన ఇంటిస్థలాన్ని స్థానిక అగ్రకులస్తులు కొందరు కబ్జాచేయటానికి ప్రయత్నిస్తూ కొండమ్మపై దాడిచేసి వేధింపులకు గురిచేస్తున్నారు.

**తూర్పుగోదావరి :** 29.04.05న అంబాజీపేట మండలం జి. అగ్రహారం ప్రసాద్‌నగర్ కాలనీకి చెందిన కృష్ణమూర్తి అనే దళితుడు పొలంలో పనిచేసుకుంటుండగా స్థానికులైన ఉపేంద్రకుమార్, రమేష్, రాంబాబులు కులం పేరుతో దూషించి కొట్టారు.

**పశ్చిమగోదావరి :** 2.04.05న జీలుగుమిల్లి మండలం దర్భగూడెం గ్రామంలో ట్రాక్టరు డ్రైవరుగా పనిచేస్తున్న దావీదు అనే దళితుడు జీతం పెంచమని అడిగినందుకు యజమాని కులంపేరుతో దూషించి అవమానించాడు.

**మహబూబ్‌నగర్ :** 4.04.05 న షాద్‌నగర్ మండలం ఫరూక్‌నగర్‌కు చెందిన నర్సింహులు (40) అనే దళితుడు నివాసం ఉంటున్న స్థలాన్ని ఖాళీ చేయమని ఒత్తిడితెస్తూ తీవ్రంగా కొట్టి చిత్రహింసలకు గురిచేశారు.

10.04.05న అడ్డాకుల మండలం కందూరు గ్రామంలో శ్రీను అనే దళిత యువకుడిపై స్థానిక దళితేతరులు కొందరు అర్ధరాత్రి సమయంలో పెట్రోలు పోసి అంటించి సజీవదహనం చేశారు.

29.04.05న నాగర్‌కర్నూలు నియోజకవర్గానికి చెందిన వనపట్ల గ్రామంలో అలివేలు, రాములమ్మ అనే దళిత మహిళలు మంత్రాలు చేస్తున్నారన్న నెపంతో గ్రామస్తులంతా కలిసి వారిపై దాడిచేసి కులం పేరుతో దూషించి, ఇనుపరాడ్ కాల్చి చేతులపై వాతలు పెట్టి చిత్రహింసలకు గురిచేశారు.

**హైదరాబాద్ :** 1.04.05న షేక్‌పేట మండలం వినాయక్‌నగర్‌కు చెందిన రాజు అనే దళితుడిపై అదే బస్తీకి చెందిన ఆనంద్, రాజు, రమేష్‌కుమార్, శివకుమార్, శ్రీను కలిసి దాడిచేసి కులంపేరుతో దూషించారు.

17.04.05న హైదరాబాద్‌లోని అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన ఎస్.యాదగిరి అనే దళితుణ్ణి స్థానిక డివిజన్ అధ్యక్షుడు వి. శ్రీరాములుగౌడ్ వ్యక్తిగత కక్షలను దృష్టిలో పెట్టుకొని కులంపేరుతో దూషించాడు.

**వరంగల్ :** 5.04.05న రేగొండ మండలం రాజక్కపల్లె గ్రామంలో సారమ్మ (65) అనే దళిత మహిళ మంత్రాలు చేస్తుందన్న నెపంతో గ్రామస్తులు ఆమె ఇంటిపై దాడిచేసి, దూషించారు. అవమానాన్ని తట్టుకోలేక సారమ్మ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని మరణించింది.

**కర్నూలు :** 19.04.05న కృష్ణగిరి మండలం అలకొండ గ్రామంలో శ్రీరాములు అనే దళితుడు గుడిమెట్లు ఎక్కాడని స్థానిక పూనకాలమ్మ అనే దళితేతర మహిళ దళితుడి ఒళ్ళు కాల్చివేసింది.

**కరీంనగర్ :** 2.04.05న ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామంలో చెప్పులు కుట్టుకుంటూ జీవించే ఉప్పలయ్య (55) అనే దళితుడు గత మూడు నెలలుగా పస్తులుంటూ తినటానికి తిండిలేక ఆకలితో మృతిచెందాడు.

( తరువాయి 15వ పేజీలో ..... )

( 10వ పేజీ తరువాయి ..... )

కోర్సులు వచ్చినై. బ్రిటన్‌ల ఒక కాలేజిలనైతే 700 'వృత్తివిద్య' కోర్సులు జెప్తరట.[1] ఐర్లాండుల వ్యవసాయం విషయాల మీద గూడ ఈ కోర్సులున్నయి.[2] 'వృత్తివిద్య' మీద రిసెర్చిసెంటర్లున్నయి. ఇండియాల మన ప్రభుత్వం గూడ స్వాతంత్ర్యం వచ్చినంక 'వృత్తివిద్య'ను ఒక తీరుల మొదలువెట్టింది. 1948 రాధాక్రిష్ణన్ కమిషన్ నుంచి, 1952ల అదే కమిషన్ జెప్పిన "హైస్కూలు విద్య.. తర్వాత... విద్యార్ధి అవసరమనుకుంటె ..... కొలువు జెయ్యగలగాలె....." అనే మాటలనుంచి, 1964 నాటి కొఠారి కమిషన్ నుంచి, 1968 నాటి జాతీయ విద్యావిధానం ( National policy on Education - NPE) నుంచి, 1976లో NCERT రాసిన " హైస్కూలు విద్యను వృత్తివిద్య తీర్గమార్చుడు ( Higher Secondary Education and its vocationalisation.)" అనే వ్యాసం నుంచి, మల్ల 1986ల, 1992ల మార్పులు చేర్పులతోటి వచ్చిన NPE దాక మంచి పెరుగుదలనే గనవడ్డది గని మనకు జరిగిన ఉపయోగం బాగ తక్కువ. ఈ కోర్సులల్ల గూడ చాలా వాటిని ఒక్క ఇంగ్లీషు మీడియంలనే నడిపిస్తున్నది. ప్రభుత్వం ఏ పని పక్కాగ జేస్తాలేదాయె. మనకేమొ ఒడుపులు దెల్సుకుని ముందుకు దూసుకుంటవొయ్యె తెలివితేటలు తక్కువనాయె. ఒకవేల, తెలివితేటలు దెచ్చుకున్నా అడ్డగోడలు, అడ్డురాల్లు దాటే శక్తి, సంగబలం గూడకర్వాయె. ప్రభుత్వం తన పద్ధతులను మనకు ఇంకా అనుకూలంగా ఉండేటట్టు మార్చుమని అడుగాలె.

అసలుకైతె, వృత్తి విద్యాకోర్సులు నిజానికి ఒక దగ్గర సుట్టుపక్కలున్న ఉత్పత్తి - వ్యాపారాలను బట్టి అక్కడున్న బడులు, కాలేజీలు, పెద్దమనుషులు అందరుగూడి ఎంచుకోవాలె. తయారు జేసుకోవాలె. పై సదువులుకు పొయ్యె అవకాశం ఉండెటట్లు తయారుజేసుకోవాలె. ప్రభుత్వం అచ్చేసుకున్న రూల్సు పుస్తకాలల్ల మాత్రం ఇవి గనపడ్తయి. అమలు అయ్యే దగ్గర్నె తలకాయనొప్పి. ఆడపిల్లలకైతే ఇవ్వి ఇంకా దూరంల ఉన్నయి.

దాదాపు అన్ని రాష్ట్రాలల్ల 'బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్' అనే సంస్థకింద వృత్తి విద్య కోర్సులు నడుస్తున్నయి. మన దగ్గర ఐ.టి.ఐ అటువంటిదే. కేంద్రప్రభుత్వ సంస్థలకింద గూడ ఈ కోర్సులున్నయి. సి.టి.ఐ. అటువంటి వాటిల్ల ఒకటి. అంతేగాక, మనరాష్ట్రంల బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ కింద ఈ కోర్సులు నడుస్తున్నయి. ప్రతిజిల్లాకు ఒక 'వృత్తి విద్య' కోర్సు అధికారిని పెట్టింఁడు. ఇంటర్మీడియట్ బోర్టుకింద 746 కాలేజీలల్ల ఈ కోర్సులు నడుస్తున్నాయి. వీటిల్ల 1680 సెక్షన్లు ఉన్నయి. ఈ బోర్డు కింద 45 కోర్సులు[3] నడుస్తున్నయి. పై సదువులకు గూడ పోవాలని ముందటనే ఆలోచన ఉంటే బ్రిడ్జి కోర్సులు గూడ జెప్తరు. ఇటువంటి విషయాలు ఇంక ఉన్నయి. అప్రెంటీసు పని ఉంటది. తర్వాత సరిపోయె ఉద్యోగంల జేర్పిచ్చె సహకారం గూడ కొన్ని కాలేజీలు, కొందరు పట్టింపున్న వాల్లు జేస్తున్నరు.

గివ్వి ఉన్న అవకాశాలు అవ్విటిని అందుకునుటానికి అడ్డాలు గూడ బాగనె ఉన్నయి. అయిన తప్పదు. నీరసపడద్దు తెలివినేర్వాలె. ఒడుపుదెల్వాలె. తెగింపుజెయ్యాలె. మన బత్కుకూ ఉపయోగం. మన లేనికులాలోల్లకూ ఉపయోగం.

( 4వ పేజీ తరువాయి ..... )

5.04.05న పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో గ్రామసర్పంచ్ భర్త మండల సత్యన్నారాయణ రెడ్డి గ్రామ దళితులను మంచినీటి బావి తవ్వకం విషయంలో కులంపేరుతో దూషించాడు.

14.04.05న తిమ్మాపూర్ మండలం జూగుండ్ల గ్రామంలో మధ్యాహ్న భోజనంలో కులవివక్ష చూపుతున్న సందర్భాలు అధికారులకు తెలియడంతో వారు గ్రామంలో సహపంక్తి భోజనాన్ని ఏర్పాటుచేశారు. దళితేతరులంతా భోజనాన్ని చేయకుండా దళితులను అధికారుల ముందే అవమానించారు.

18.04.05న కౌతాళం మండల కేంద్రంలో హనుమంతు అనే దళితుడు చెప్పుల షాపు నిర్వహిస్తున్నాడు. స్థానికుడైన మంగలి లింగన్న అనే వ్యక్తి అకారణంగా షాపుపై దాడిచేసి తీవ్రంగా కొట్టి కులంపేరుతో దూషించాడు.

**కడప :** 1.04.05న సంబేపల్లి మండలం మోటకట్లకు చెందిన సురేష్‌బాబు అనే వ్యక్తికి సుధాకర్ రెడ్డి అనే మరో వ్యక్తికి మధ్య ఆటోల కారణంగా వివాదం జరుగుతుండగా మధ్యలో నరసింహులు అనే దళితుడు అడ్డుకోబోయినందుకు వారిద్దరూ కలిసి దళితుణ్ణి కులం పేరుతో దూషించారు.

**కృష్ణా :** 9.04.05న నందిగామ మండలం కంచికచర్ల గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు ఆర్.ఎస్.పి బాబు అనుచరులు రవికుమార్ అనే దళితుడిపై దాడిచేసి కొట్టారు.

21.04.05న ఘంటసాల మండలం కొడాలి గ్రామంలో రవి (28) అనే దళితుణ్ణి స్థానికులైన శివయ్య, సుబ్బయ్యలు అకారణంగా కులంపేరుతో దూషించి కొట్టారు.

**అనంతపురం :** 1.04.05న అమరాపురం మండలం హల్కూరు గ్రామంలో హనుమక్క (25) అనే దళిత మహిళపై అదే గ్రామానికి చెందిన గొల్ల ఈరన్న, గొల్ల నాగభూషణం, గొల్ల మంగోరప్ప మరికొంతమంది కలిసి దాడిచేసి కులం పేరుతో దూషించారు.

**ఆదిలాబాద్ :** 20.04.05న గుడి హత్నూర్ మండలం సీతాగొంది గ్రామంలో దళిత యువతిని అదే గ్రామానికి చెందిన వినోద్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో వివాహం చేసుకుంటానని నమ్మించి అత్యాచారం చేశాడు.

**మెదక్ :** 13.04.05న గద్వాల మండలం నర్వ గ్రామంలో దళితులు దేవాలయంలోనికి వెళ్ళినందుకు ఆలయ చైర్మన్ హనుమంతరెడ్డి వారిని అవమానించి కులంపేరుతో దూషించాడు.

# దళితులపై జరిగిన అత్యాచార నేరాలు - మే - 2005

**తూర్పు గోదావరి :** 2.05.05న రావులపాలెం మండలం ఈతకోట గ్రామానికి చెందిన నందకుమారి (23) అనే దళిత యువతి స్థానిక రైసుమిల్లులో పనిచేస్తుంది. ఆమెతో పాటు పనిచేస్తున్న రాంబాబు అనే వ్యక్తి వేధింపులకు గురిచేస్తూ కులంపేరుతో దూషించి కత్తితో గాయపరిచాడు.

9.05.05న తునిమండలం తిమ్మాపూర్ గ్రామంలో జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో దళితుడైన రాజు పాల్గొన్నందుకు పురుషోత్తం, సూరిబాబు అనేవారు కులం పేరుతో దూషించారు.

**పశ్చిమగోదావరి :** 2.05.05న కామవరపు కోట మండలంలో వెంటేశ్వరరావు అనే దళితుడు రెబ్బాచిన్న అనే భూస్వామి వద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. కూలీ డబ్బులు అడిగినందుకు భూస్వామి దళితుణ్ణి కొట్టి చంపాడు.

14.05.05న చాగల్లు మండలం చిక్కాల గ్రామానికి చెందిన సుబ్బయ్య (60) అనే దళితుడు కూలీ పనులకు రావలసిన డబ్బులు అడిగినందుకు యజమాని అయిన అర్జునరావు సుబ్బయ్యను కర్రతో కొట్టి చంపాడు.

**మెదక్ :** 3.05.05న అందోలు మండలం నాదులాపూర్ గ్రామానికి చెందిన దళిత మహిళ కమలమ్మ కుల ధృవపత్రం కోసం రెవెన్యూ కార్యాలయానికి వెళ్తే రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఆమెను కులంపేరుతో దూషించాడు.

3.05.05న ములుగు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో దళితమహిళలు పొదుపు పథకం ద్వారా రావాల్సిన డబ్బులు అడిగినందుకు డ్వాక్రా పథకం ఫెసిలిటేటర్ జయబాయి దళిత మహిళల్ని కులం పేరుతో దూషించింది.

5.5.05న రామాయంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన కిషన్ (30) అనే వ్యక్తి కూలీ పనిచేసుకొని జీవిస్తున్నాడు. గత మూడు నెలలుగా కుటుంబం గడవక పస్తులుండి ఆకలితో మృతి చెందాడు.

**మహబూబ్‌నగర్ :** 3.05.05న బాలానగర్ మండలం చొక్కంపేట గ్రామంలో నర్సింహులు, శాంతయ్య పెంటయ్య అనే దళితులపై దళితేతరులు దాడిచేసి కొట్టారు.

**వరంగల్ :** 9.05.05న హనుమకొండ మండలం హసన్‌పర్తి గ్రామంలో దళిత యువతిపై గుర్తు తెలియని వ్యక్తులు సామూహికంగా అత్యాచారం చేశారు.

**కరీంనగర్ :** 5.5.05న హుజూరాబాద్ మండలం సింగాపురం గ్రామానికి చెందిన భాస్కర్ (22) అనే దళితుణ్ణి ఒక కేసు విషయమై ఎస్.ఐ విచారణ పేరుతో హింసించటంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

18.5.05న మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన లక్ష్మి అనే దళిత మహిళను అదే గ్రామానికి చెందిన కొందరు దళితేతర వ్యక్తులు దాడిచేసి కొట్టి కులం పేరుతో దూషించారు.

**ఆదిలాబాద్ :** 8.05.05న గజ్వేల్ మండలం మూసాయిపేట గ్రామంలో భూపతి అనే దళితుణ్ణి అదే గ్రామానికి చెందిన జంగడి కిష్టయ్య, శ్రీను మరికొందరు కులంపేరుతో దూషించి దాడి చేశారు.

**ఖమ్మం :** 12.5.05న చింతకాని మండలంలో ఎస్సీ కాలనీకి చెందిన దళిత మహిళపై వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు బంధువుల ఇంటికి వెళ్ళి తిరిగివస్తున్న ఆమెను వెంబడించి గ్రామానికి చివరన ఉన్న మారుమూల ప్రాంతానికి తీసుకెళ్ళి సామూహికంగా అత్యాచారం చేశాడు.

## అంబేద్కర్ మాట

విద్యకు సంబంధించి ........

జీవితపు అన్ని రంగాల్లోనూ నేను నేర్చుకున్న జ్ఞానమే నా శక్తి అని నిరూపించబడింది. జ్ఞాన సాగరపు ఎల్లలు తెలియనంత కాలం షెడ్యూల్డ్ కులాల ప్రజలు తమ లక్ష్యాలైన స్వేచ్ఛ స్వాతంత్ర్యపు శిఖరాలను చేరుకోలేరు.

**- డా॥ బి.ఆర్. అంబేద్కర్**

## చదువుకోర కన్నయ్యా .....

చదువుకోర కన్నయ్యా చదువుకోర నా నాన్నా
పెద్ద చదువు చదివి పేరు తెచ్చుకోర నాన్నా
లాలి పాడతా నీకు జోల పాడతా ..... జోల పాడతా .....
నీకు లాలి పాడుతా ॥చదువుకోర॥

అంటరాని తనంలోన అంబేద్కర్‌ని చూడరా
గొప్ప చదువులు చదివినాడు రాజ్యాంగం రాసినాడు
అతనివోలె పోరాడ చదువుకోర కన్నయ్యా
॥చదువుకోర॥

మహానుభావుడు మన పూలేను చూడరా
గులాంగిరిని రాసాడు తిరుగుబాటు చేసాడు
అతనివోలె పోరాడ చదువుకోర కన్నయ్యా
॥చదువుకోర॥

రామున్ని నిలబెట్టి చెప్పుదెబ్బలు తినిపించిన
పెరియర్‌ను చూడరా పోరుబాట నడవరా
అతనివోలె పోరాడ చదువుకోర కన్నయ్యా
॥చదువుకోర॥

టంగుటూరి, ఇందిరలు చీమకుర్తి చెల్లెల్లు
కలబడమన్నారు కసితీర్చమన్నారు
వారికోసం పోరాడ కలిసిరార అన్నయ్యా ॥చదువుకోర॥

కారంచేడు వీరులు చుండూరు అన్నలు
కులం కుట్రలెదిరించి అమరులై నిలిచారు
వారివోలె పోరాడ కలిసిరార అన్నయ్యా ॥చదువుకోర॥

మనువాదుల పారదోలె దండోరా నాదాలు
వినిపించ కదలరా వినిపించుదాముర
దళిత జనుల రగిలించి దండయాత్ర చేయాలి
॥చదువుకోర॥

- జి.వి. రత్నాకర్

మీ అభిప్రాయాలను కింది చిరునామాకు పంపండి.

**సాక్షి**

**హ్యూమన్ రైట్స్ వాచ్, ఎ.పి.**
**ఇం.నెం. 10-1-564, టి.ఐ.టి., బ్లాక్ - 50.**
**వెస్ట్ మారేడుపల్లి, సికింద్రాబాద్ - 500 026.**

**ఫోన్ : 040 - 27801368**
**ఫ్యాక్స్ : 040 - 27715086**
**ఇ-మెయిల్ :** Sakshi_ap@satyam.net.in
**వెబ్‌సైట్ :** www.sakshiap.org

**BOOK - POST**

Printed Matter

To

Published by Dr. S.D.J.M Prasad Director, Sakshi Human Rights Watch, A.P. Secunderabad - 500 026.